



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 11 సంచిక : 308 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 14 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :308 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 14 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




## ఈనెల 26న సింగపూర్‌కి ఏపీ సీఎం చంద్రబాబు

- సింగపూర్ పర్యటనకు వెళుతున్న సీఎం చంద్రబాబు
- ఈ నెల 26 నుంచి 30 వరకు సింగపూర్ పర్యటన
- చంద్రబాబుతో పాటు వెళ్లనున్న మంత్రులు లోకేశ్, భరత్, నారాయణ, అధికారులు
- పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన అజెండా



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలో ఈ నెల 26న సింగపూర్ పర్యటనకు వెళుతున్నారు. ఈ నెల 30 వరకు ఆయన పర్యటన సాగనుంది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఆయన ఈ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ పర్యటన లో చంద్రబాబుతో పాటు మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, నారాయణ, ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారు.సింగపూర్ పర్యటనలో చంద్రబాబు బృందం అక్కడి ప్రభుత్వ పెద్దలతో మరియు వివిధ వ్యాపార సంస్థల

వివరాలు 2లో..

## స్పేస్ పాలసీ ప్రకటించిన ఏపీ ప్రభుత్వం

- ఐదేళ్ల కాలవ్యవధితో ఏపీ అంతరిక్ష విధానం
- స్పేస్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆదేశాలు
- దేశీయ, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యం




పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం ఐదేళ్ల కాలానికి వర్తించే కొత్త అంతరిక్ష విధానాన్ని (స్పేస్ పాలసీ) ప్రకటించింది. ఈ విధానాన్ని అమలు చేయడానికి రాష్ట్ర స్పేస్ సిటీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.ఈ స్పేస్ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, స్టార్టప్‌లకు నిధులు సమకూర్చడం వంటి లక్ష్యాలను ప్రభుత్వం పెట్టుకుంది. దేశీయ, అంతర్జాతీయ సంస్థలను ఈ ప్రాజెక్టులలో భాగస్వామ్యులుగా చేసుకోవాలని సూచించింది.స్పేస్ సిటీ కార్పొరేషన్ అంతరిక్ష ప్రాజెక్టుల అమలుకు సహాయం చేస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ స్పేస్ సిటీలు సత్యసాయి మరియు తిరుపతి జిల్లాల్లో ఏర్పాటు చేయబడతాయి. భూ కేటాయింపులు మరియు దరఖాస్తుల పరిశీలన వంటి ప్రక్రియలు ఒక కమిటీ ద్వారా అనుమతులు పొందుతాయని ప్రభుత్వం తెలియజేసింది.

వివరాలు 2లో..



# విలక్షణ నటుడికి కన్నీటి వీడ్కోలు

- కోట శ్రీనివాసరావు ఇకలేరు - తెలుగు సినిమాకు తీరని లోటు
- రాజకీయాల్లోనూ కోట 'విభిన్న' పాత్ర
- ప్రముఖుల నుండి సంతాప సందేశాలు
- చివరి వీడ్కోలు - అభిమానుల రోదనలు

ముగిసిన కోటా శ్రీనివాసరావు అంత్యక్రియలు

కోటకు అంతిమ సంస్కారాలు నిర్వహించిన పెద్ద మనవడు శ్రీనివాస్





**కాకినాడ స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, జూలై 13:** తెలుగు చిత్రసీమను తన విలక్షణ నటనతో నాలుగు దశాబ్దాలపాటు శాసించిన ప్రముఖ నటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు (82) ఆదివారం ఫిల్మ్‌నగర్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఉదయం 4 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో సినీ, రాజకీయ, సాంస్కృతిక వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతి నెలకొంది.చిత్రరంగంలో అద్భుతమైన ప్రయాణం:1942 జూలై 10న కృష్ణా జిల్లా కంకిపాడులో జన్మించిన కోట, 1978లో ప్రాణం ఖరీదు చిత్రంతో తెలుగు సినీ రంగంలో అడుగుపెట్టారు. తన వైవిధ్యభరితమైన నటనతో 750కి పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. విలన్‌గా, కామెడీ నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తనదైన శైలిలో నటించి తెలుగు సినిమాకు కొత్త మెరుగులు అద్దారు. ఆయనకు పద్మశ్రీతో పాటు అనేక పురస్కారాలు లభించాయి.కోట శ్రీనివాసరావు కేవలం కళారంగానికే పరిమితమవకుండా, 1999లో ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాసేవకు పాటుపడ్డారు. ప్రజాపక్ష రాజకీయాల్లోనూ ఆయన గొప్ప స్పష్టత, నిబద్ధత చూపారు.కోట మృతిపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు:సీఎం రేవంత్ రెడ్డి: "తెలుగు ప్రజల గుండెల్లో కోటా గారు చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆయన పోషించిన పాత్రలు అనంతమైనవి."

సీఎం చంద్రబాబు నాయుడు: "తెలుగు చిత్ర పరిశ్రమకు కోట గారి మరణం తీరని లోటు. ఆయన నటనా కృషి చిరస్మరణీయమైనది."వైఎస్ జగన్ మోహన్ రెడ్డి: "కోట గారికి పద్మశ్రీతో పాటు అనేక పురస్కారాలు లభించాయి. ఆయన నటన మనసుల్లో నిలిచిపోయే ముద్ర వేశాయి."పార్థివ దేహాన్ని సందర్శించిన సినీ ప్రముఖులు బ్రహ్మానందం, రాజేంద్రప్రసాద్, మురళీమోహన్, తనికెళ్ల భరణి, రావు రమేశ్ తదితరులు ఆయనకు నివాళులు అర్పించారు. కోట గారి మృతితో సినీ అభిమానులు, కళాభిమానులు కన్నీరు మున్నీరవుతున్నారు.కోట జీవితం %-% నటనకు అర్థం చెప్పిన పాఠంవినయంతో కూడిన వ్యక్తిత్వం, ఆలోచనాత్మక నటన, స్పష్టమైన వ్యక్తిత్వంతో కోట శ్రీనివాసరావు గారు తెలుగు సినిమాకు గౌరవాన్ని తీసుకువచ్చారు. ఆయన లేని లోటు పూడ్చలేనిది. పెన్ పవర్ బృందం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నది.

## నీటి కోసం ఎదురుచూస్తున్న వారిపై కాల్పులు.. గాజాలో 19 మంది మృతి



పెన్ పవర్ డెస్క్:డెయిర్ అల్ బలా: గాజాలోని సామన్య పౌరులపై ఇజ్రాయెల్ దాడులు పాశవికంగా కొనసాగుతు న్నాయి. తాగునీటి కోసం ఓ ప్రాంతంలో గుమిగూడిన జనంపై ఆదివారం జరిపిన దాడిలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు చిన్నారులు కూడా ఉన్నారు. ఈ మేరకు అక్కడి ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. తాజా మరణాలతో ఇప్పటి వరకు మృతి చెందిన

వివరాలు 2లో..

## వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు



పెన్ పవర్ డెస్క్: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ప్రయత్నాలు మొదలు పెట్టారు. నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు ఎక్స్ వేదికగా కీలక ప్రకటన చేశారు. 2025-2030 మధ్య కాలంలో కోటి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల కల్పన హామీ దాదాపు పూర్తయిందన్నారు.

వివరాలు 2లో..

## తిరుమలలో జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం



పెన్ పవర్ డెస్క్:తిరుమల శ్రీవారి ఆలయంలో పెద్దజీయంగార్లు చాతుర్మాస దీక్షను ఆదివారం(జూలై13) ప్రారంభించారు. ఆనవాయితీ ప్రకారం.. ఈ దీక్ష ప్రారంభానికి ముందు శ్రీ వరాహస్వా మివారి ఆలయాన్ని, స్వామి పుష్కరిణిని సందర్శించారు. ఆ తరువాత మంగళవా యిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేసి, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధిక రులు వారికి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనం అనంతరం పెద్దజీయర్ మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దీక్షా సంకల్పాన్ని చేపట్టారు. శ్రీ వైష్ణవ సంప్రదాయకర్త శ్రీరామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాస దీక్ష విశేషమైంది.

వివరాలు 2లో..

## కేరళ సిఎంకు బెదిరింపులు..పినరయి విజయన్ ఇంట్లో బాంబు పెట్టామని మేసేజ్




పెన్ పవర్ డెస్క్:తిరువనంతపురం: కేరళ సీఎం ఇంట్లో బాంబు పెట్టామని ఆదివారం (జూలై13) బెదిరింపులు వచ్చాయి. కేరళ సీఎం పినరయి విజయన్ అధికారిక నివాసం క్లిఫ్ హౌస్ కు బాంబు పెట్టామని తుపానూర్ పోలీస్ స్టేషన్ కు ఈమెయిల్ ద్వారా బెదిరింపు మేసేజ్ వచ్చింది. అది ఎవరి ద్వారా వచ్చిందో ఇంకా గుర్తించలేదని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. క్లిఫ్ హౌస్ దగ్గర బాంబు పేలుళ్లు జరగబోతున్నాం అని పోలీసులకు మేసేజ్ పంపించారు గుర్తుతెలియని వ్యక్తులు.

వివరాలు 2లో..

## మా అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమే

### పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్



- ఇటీవల ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్
- ఆ సమయంలో అణు ఉద్రిక్తతలు ఏర్పడ్డాయని వార్తలు
- వివరణ ఇచ్చిన పాక్ ప్రధాని

పెన్ పవర్ డెస్క్:భారత్ ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో అణు ఉద్రిక్తతలు ఏర్పడ్డాయని, పాకిస్థాన్ అణుదాడికి సిద్ధమైందని వచ్చిన కథనాలను ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తోసిపుచ్చారు. పాకిస్థాన్ అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసం, ఆత్మరక్షణ కోసమే తప్ప, ఇతరులపై దాడుల కోసం కాదని ఆయన స్పష్టం చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య

వివరాలు 2లో..

## వైసీపీ నాయకుల్లో ఒక మహానటి ఉంది

- కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ వివాదంపై మంత్రి కొల్లు రవీంద్ర ప్రెస్ మీట్
- వైసీపీ నాయకులపై తీవ్రస్థాయిలో విమర్శలు
- అడ్డంగా బుక్ అయిపోయారని వ్యాఖ్యలు



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళగిరిలోని టీడీపీ జాతీ య కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైసీపీ నాయకులపై తీవ్ర ఆరోపణలు చేశారు. వైసీపీ నాయకత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే

వివరాలు 2లో..

## కోట ఒకే సీన్ లో రెండు రకాలుగా నటించగలరు

- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కోట
- ఆదివారం తెల్లవారుజామున కన్నుమూత
- కోట భౌతికకాయానికి నివాళులు అర్పించిన సీఎం చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్: తెలుగు చిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా గుర్తింపు పొందిన కోట శ్రీనివాసరావు (83) ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని తన నివాసంలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు జూబ్లీహిల్స్‌లోని కోట నివాసానికి వెళ్లి ఆయన

వివరాలు 2లో..

ఎడిటర్ వ్యూ

# ఫీడ్ బ్యాక్ కోసం

వైసీపీ అధినేత వైఎస్ జగన్ జిల్లాల పర్యటనలకు కొద్దిరోజులు విరామం ఇచ్చి నేతలతో సమావేశం అవ్వాలని కోరుతున్నారు. నేతలతో సమావేశమై ముందు గత ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను పూర్తి స్థాయి విశ్లేషించడానికి సమయం వెచ్చించాలని నేతలు సయితం కోరుతున్నారు. గత ఐదేళ్ల పాటు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పిదాలు, తీసుకున్న నిర్ణయాలు వంటి వాటిపై గ్రౌండ్ లెవెల్ లో ఏం జరుగుతుందన్న దానిపై నేతల నుంచి విడివిడిగా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని కోరుతున్నారు. సమావేశాల్లో తాను చెప్పడమే కాకుండా, తాను చెప్పింది విని నేతలు వెళ్లే పనికి స్వస్తి చెప్పి వారికి మైకు ఇచ్చి మాట్లాడించగలిగితే చాలా వరకూ సమస్యలు పరిష్కారమవుతాయని సూచిస్తున్నారు.

**పర్యటనలను సక్సెస్ అవుతున్నాయంటే?**

జగన్ జిల్లాల పర్యటనలు సక్సెస్ అవుతున్నాయంటే అందుకు నేతలు, కార్యకర్తలు కారణం. ఎందుకంటే ఆంక్షలు పెట్టినా నేతలు, కార్యకర్తలు భయపడకుండా రోడ్డుపైకి వస్తున్నారంటున్నారు. అంత ఉత్సాహంతో పనిచేస్తున్న కార్యకర్తలు, నేతలు ఈసారి ఎన్నికలలో ఇచ్చే హామీలతో పాటు అధికారంలోకి వస్తే ఏం చేయాలన్న దానిపై జగన్ నుంచి క్లారిటీ వస్తే మరింత పార్టీకి హైప్ వస్తుందని చెబుతున్నారు. వాలంటీర్ల వ్యవస్థను జగన్ తీసుకు వచ్చి తప్పు చేశానని ఇంత వరకూ ఆయన అనలేదు. పైగా వాలంటీర్లను తొలగించడం అన్యాయమంటూ జగన్ అధికార టీడీపీ పై విమర్శలు చేస్తుండటంతో మళ్లీ అధికారంలోకి వస్తే వాలంటీర్ల వ్యవస్థను తిరిగి తెస్తారా? అన్న అనుమానం కార్యకర్తల్లో ఉంది.

**ఎమ్మెల్యేలకు గౌరవం...**

వాలంటీర్లు తిరిగి వస్తే తాము పార్టీ కోసం కష్టపడినా ప్రయోజనం ఏముంటుందని పలువురు అప్పుడే ప్రశ్నిస్తున్నారు. అలాగే కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా ఎమ్మెల్యేలను కూడా ప్రజల్లో భాగస్వామ్యులను చేయగలిగేలా జగన్ పనితీరు ఉండాలని వైసీపీ నేతలు కోరుకుంటున్నారు. తమ చేత పంపిణీ చేయించండంతో పాటు ప్రజలకు తమను దగ్గరకు చేర్చడం వంటి పనులను చేయగలిగితేనే ఈసారి గెలిచినా తగిన గుర్తింపు ఉంటుందని, లేకపోతే 2019 తర్వాత పరిస్థితి తిరిగి పునరావృతమవుతుందని, ఎన్ని లక్షల కోట్ల రూపాయలు బటన్ నొక్కి పంపిణీ చేసినా చివరకు ఎన్నికల సమయానికి అది ఏమాత్రం పనిచేయదని కూడా చెబుతున్నారు.

**కార్యకర్తలకు భరోసా...**

కార్యకర్తలకు ఈసారి తాను అధికారంలోకి వస్తే పెద్దపీట వేస్తానని, ప్రాధాన్యత ఇస్తానని జగన్ పదే పదే పలు సమావేశాల్లో చెబుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది. అధికారంలోకి రాగానే తాము ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కార్యకర్తలకు ఏం చేయగలరన్న దానిపై కూడా క్లారిటీ ఉండాలని క్యాడర్ అభిప్రాయపడుతుంది. ఎమ్మెల్యేలతో పాటు క్యాడర్ ను కూడా సరిగా చూసుకుంటేనే గెలుపు సాధ్యమవుతుందని, ఈ నాలుగేళ్లు కూడా తాను చెప్పిందే విని వెళ్లాలని కాకుండా, వారి నుంచి కూడా ఫీడ్ బ్యాక్ తీసుకుని దాని ప్రకారం ముందుకు వెళితే మంచి ఫలితాలు రాబట్టుకోవచ్చని, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని క్యాష్ చేసుకోవచ్చని పలువురు సూచిస్తున్నారు. మరి జగన్ నేతల మాట వింటారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

## నీటి కోసం ఎదురుచూస్తున్న వారిపై కాల్పులు..

## గాజాలో 19 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

వారి సంఖ్య 58 వేలు దాటిందని తెలిపాయి. ఇజ్రాయెల్ కాల్పుల విరమణ చేపట్టాలని ప్రతిగా తమ వద్ద బందీలుగా ఉన్న ఆ దేశ పౌరుల్ని విడుదల చేయాలన్న నిబంధనతో ఇరు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. అయితే, ఆ దిశగా పరోగతి సాధించేందుకు మాత్రం వారు ముందుకు రావడం లేదు. గత వారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా పర్యటనకు వెళ్లారు. అక్కడ ట్రంప్ యంత్రాంగంతో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో కొత్త వివాదం తెరమీదకి వచ్చింది. గాజా స్ట్రిప్ నుంచి తమ బలగాలను వెనక్కి తీసుకునేందుకు ఇజ్రాయెల్ నిరాకరించింది. దక్షిణ గాజాలో తమ సైన్యాన్ని కొనసాగించాలని భావిస్తోంది. దీనిపై హమాస్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తాత్కాలిక కాల్పుల విరమణ ముగిసిన తర్వాత ఇజ్రాయెల్ మళ్లీ యుద్ధాన్ని కొనసాగించాలని చూస్తోందని, అందుకే బలగాల ఉపసంహారణకు అంగీకరించడం లేదని వాదిస్తోంది. మరోవైపు హమాస్ పూర్తిగా లొంగిపోయినప్పుడే యుద్ధానికి ముగింపు పలుకుతామని ఇజ్రాయెల్ తెగేసి చెబుతోంది. కానీ, హమాస్ అందుకు నిరాకరిస్తోంది. తమ వద్ద బందీలుగా ఉన్న 50 మందిలో సగం మంది మాత్రమే బతికి ఉన్నారని చెబుతోంది. ప్రతిగా ఇజ్రాయెల్ యుద్ధాన్ని విరమించుకోవాలని, ఇక్కడి నుంచి తమ బలగాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.

## వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు

- మొదటి పేజి తరువాయి

గడిచిన ఐదేళ్లలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయగా.. దాదాపు 39 లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు నీతీశ్ చెప్పారు. గతంతో పోల్చుకుంటే ఈసారి రెట్టింపు ఉద్యోగాలు కల్పించబోతున్నామన్నారు. కేవలం ప్రభుత్వ సెక్టార్‌లోనే కాకుండా ప్రైవేటు, ఇతర పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు నీతీశ్ పేర్కొన్నారు.

“ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. ప్రైవేటు రంగంలో మరో 39 లక్షల మందికి ఉపాధి కల్పించాం. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల హామీ దాదాపు నెరవేరినట్లే. ఇప్పుడు లక్ష్యాన్ని రెట్టింపు చేస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలిస్తాం. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాం. ప్రధానంగా పారిశ్రామిక రంగాల్లో యువతకు ఉపాధి చూపిస్తాం” అని నీతీశ్ కుమార్ పేర్కొన్నారు. బిహార్‌లో ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశముంది.

## కేరళ సిఎంకు బెదిరింపులు..పినరయి విజయన్ ఇంట్లో బాంబు పెట్టామని మేసేజ్

- మొదటి పేజి తరువాయి

అప్రమత్తమైన పోలీసులుసెర్చింగ్ నిర్వహించారు. డాగ్ ,బాంబ్ స్క్వాడ్ల తో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈతనిఖీల్లో ఎటువంటి అనుమానాస్పదం వస్తువులు దొరకలేదని పోలీసులు తెలిపారు. సోదాలు జరిగిన సమయంలో సీఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కీలక సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల వచ్చిన బాంబు బెదిరింపులకు ఈ బెదిరింపు సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.

## కోట ఒకే సీన్ లో రెండు రకాలుగా నటించగలరు

- మొదటి పేజి తరువాయి

భౌతికకాయానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోట శ్రీనివాసరావు నటనా ప్రతిభ, సినీ రంగానికి చేసిన కృషిని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కోట శ్రీనివాసరావు నాలుగు దశాబ్దాలకు పైగా తెలుగు, తమిళం, కన్నడ, హిందీ సినిమాల్లో 750కి పైగా చిత్రాల్లో నటించి, విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనదైన ముద్ర వేశారని వివరించారు. “కోట శ్రీనివాసరావు గారి మృతి తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు. ఆయన విభిన్న పాత్రలతో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన కళాత్మక కృషి, నటనా నైపుణ్యం ఎప్పటికీ గుర్తుండిపోతాయి” అని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

“కోట శ్రీనివాసరావుతో నాకు సన్నిహిత అనుబంధం ఉంది. 1999లో నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా ఉన్నప్పుడు కోట బీజేపీ తరఫున ఎమ్మెల్యే అయ్యారు. పదవీకాలంలో ప్రజాసేవకు పాటుపడ్డారు. కోట నటనాపరంగా ఎంతో ప్రతిభావంతుడు. ఒకే సీన్ లో ఏడిపించగలరు, భయపెట్టగలరు... ఆ సామర్థ్యం కోట సొంతం. పద్మశ్రీ, 7 నంది అవార్డులతో సహా ఎన్నో పురస్కారాలు అందుకున్నారు” అని చంద్రబాబు వివరించారు.

కోట మృతిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సినీ ప్రముఖులు చిరంజీవి, పవన్ కల్యాణ్, ఎస్ఎస్ రాజమౌళి, మహేశ్ బాబు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కోట శ్రీనివాసరావు సినీ, రాజకీయ రంగాల్లో చేసిన సేవలు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని వారు కొనియాడారు.

# ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థపై ఐఎల్ఓ దీర్ఘకాలిక చర్చ

*గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ కార్మికులకు కట్టుబడి ఉండే ప్రపంచ ప్రమాణాలను రూపొందించాలనే ఐఎల్ఓ ప్రతిపాదన కార్మిక హక్కులకు ఒక మలుపును సూచిస్తుంది*

*భారతదేశం గిగ్ కార్మికుల కోసం సామాజిక భద్రతా చర్యలను అమలు చేస్తున్నందున, ఐఎల్ఓ ప్రతిపాదన నియంత్రణ విధానాన్ని రూపొందించడంలో ఒక సూచన బిందువుగా ఉపయోగపడుతుంది*




**ఐఎల్ఓ 13వ అంతర్జాతీయ కార్మిక సదస్సు:**

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) జూన్ 2-13, 2025 వరకు జరిగిన 13వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ముగించింది, ప్రతి సంవత్సరం, 187 సభ్య దేశాల నుండి ప్రభుత్వం, యజమాని మరియు కార్మికుల ప్రతినిధులు అంతర్జాతీయ కార్మిక ప్రమాణాలను రూపొందించడానికి మరియు ఐఎల్ఓ విస్తృత విధాన దిశలను నిర్వచించడానికి ఐఎల్సి వద్ద సమావేశమవుతారు.

ఈ సమావేశం ముఖ్యాంశాలలో ఒకటి “ప్లాట్‌ఫామ్ ఎకానమీలో డీసెంట్ వర్క్” పై చర్చ, ఇది ఎజెండాలో ఐదవ అంశంగా కనిపించింది. ఇది ఈ అంశంపై మొదటి ప్రామాణిక సెట్టింగ్ చర్చగా గుర్తించబడింది. ఐఎల్ఓ పాలకమండలి మొదట ఈ ఎజెండా అంశాన్ని 2021లో ప్రతిపాదించింది, దీనిలో 113వ ఐఎల్సి (2025)లో మొదటి సెషన్‌తో డబుల్ చర్చా విధానాన్ని అవలంబించారు, రెండవది 2026లో 114వ ఐఎల్సి కి షెడ్యూల్ చేయబడింది.

**ప్రామాణిక ప్రమాణాల దిశగా కీలక పురోగతి:**

11వ ఐఎల్సి యొక్క ప్రధాన పురోగతి ఏమిటంటే, ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థ కోసం ప్రత్యేకంగా బైండింగ్ ప్రపంచ కార్మిక ప్రమాణాలను అభివృద్ధి చేయడానికి ఏకాభిప్రాయం. ఈ చర్చలు సాధ్యమయ్యే ప్రమాణాల రకాలు మరియు పరిధిని వివరించే ఐఎల్ఓ నివేదికలో ఆధారపడి ఉన్నాయి. ప్లాట్‌ఫామ్ కార్మికులు మరియు డిజిటల్ కార్మిక వేదికలు రెండింటినీ ఎలా నిర్వచించాలనే క్లిష్టమైన సమస్యను పరిష్కరించాయి. సిఫార్సుతో అనుబంధంగా కొత్త సమావేశాన్ని స్వీకరించడానికి, రెండవ చర్చ కోసం ఈ అంశం 14వ ఐఎల్సి కి తిరిగి వస్తుందని అధికారికంగా అంగీకరించబడింది.

ఐఎల్ఓ యొక్క ప్రతిపాదిత సమావేశం మరియు సిఫార్సు వేగంగా విస్తరిస్తున్న గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థను నియంత్రించే దిశగా ఒక ప్రధాన అడుగును సూచిస్తుంది. ప్రస్తుతం, డిజిటల్ ప్లాట్‌ఫామ్ కార్మికులకు అంతర్జాతీయంగా ఆమోదించబడిన నిర్వచనం లేదు, లేదా వారి పని పరిస్థితులను ప్రత్యేకంగా పరిష్కరించే ఈ బైండింగ్ పరస్పర కార్మిక ప్రమాణాలు కూడా లేవు. ప్లాట్‌ఫామ్ కార్మికులు తరచుగా మంచి పని లోటులను ఎదుర్కొంటారు, వాటిలో సామాజిక భద్రత లేకపోవడం, ఆదాయ అస్థిరత మరియు ప్రాథమిక కార్మికుల హక్కులకు పరిమిత ప్రాప్యత ఉన్నాయి. ఇది ఎక్కువగా స్వయం ఉపాధి పొందిన వారిగా వారి తప్పు వర్గీకరణ కారణంగా ఉంది, ఇది వారిని జాతీయ కార్మిక రక్షణల నుండి మినహాయించింది. ఈ సవాళ్లకు అతీతంగా, ప్లాట్‌ఫామ్ కార్మికులు అల్గోరిథమిక్ నిర్వహణ, స్వచ్ఛంద ఖాతా నిష్క్రియాలలో అపారదర్శక డేటా పద్ధతులు మరియు వివాదాలలో పరిమిత సహాయానికి కూడా లోబడి ఉంటారు.

ప్రతిపాదిత అంతర్జాతీయ ప్రమాణాలు డిజిటల్ లేబర్ ప్లాట్‌ఫామ్‌లు, ప్లాట్‌ఫామ్ కార్మికులు, మధ్యవర్తులు మరియు వేతనం వంటి పదాల యొక్క ప్రపంచవ్యాప్తంగా అంగీకరించబడిన నిర్వచనాలను ప్రవేశపెట్టడం ద్వారా ఈ అంతరాలను సమగ్రంగా పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ ప్రమాణాలను ఆమోదించినట్లయితే, సభ్య దేశాలు కార్మికులకు పనిలో ప్రాథమిక హక్కులను ప్లాట్‌ఫామ్ చేయడానికి హామీ ఇవ్వాలి, వాటిలో సంఘం స్వేచ్ఛ, బలవంతపు మరియు బాల కార్మికుల నుండి రక్షణ, వివక్షత లేనిది మరియు వృత్తిపరమైన భద్రత మరియు ఆరోగ్యం ఉన్నాయి.

ప్లాట్‌ఫామ్ కార్మికుల తప్పుడు వర్గీకరణను నివారించడానికి సరైన ఉపాధి వర్గీకరణ సమస్యను కూడా ఇది పరిష్కరిస్తుంది. ఇది అన్ని ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రతా రక్షణలు మరియు అల్గోరిథమిక్ పారదర్శకత, డేటా గోప్యత, ఖాతా నిష్క్రియం మరియు ఆటోమేటెడ్ వ్యవస్థల ఉపయోగం వంటి కీలకమైన సమస్యలకు సంబంధించిన అంచనాలను కూడా కలిగి ఉంటుంది.

**నియంత్రణలో అంతర్జాతీయ లోటును తీర్చే దిశగా ఐఎల్ఓ:**

ప్రపంచవ్యాప్తంగా, గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థను నియంత్రించడానికి దేశాలు ఫ్రేమ్‌వర్క్‌లను అభివృద్ధి చేయాలనే పట్టులో ఉన్నాయి. ప్లాట్‌ఫామ్ కార్మికులను రక్షించడానికి నియంత్రణ ప్రయత్నాలు సాపేక్షంగా ప్రారంభ దశలో ఉన్నాయి, ఎక్కువగా 2022 నుండి ఉద్భవిస్తున్నాయి, ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు మూడు ప్రధాన విధానాలను అవలంబిస్తున్నాయి: ప్లాట్‌ఫామ్ కార్మికులను (యుఎస్, బెల్జియం, చిలీ ఈక్వెడార్) చేర్చడానికి ఉన్న కార్మిక చట్టాలను సవరించడం, గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ కార్మికుల కోసం ప్రత్యేకంగా స్వతంత్ర చట్టాన్ని ప్రవేశపెట్టడం (యూరోపియన్ యూనియన్, అర్జెంటీనా, పెరూ), మరియు ఇప్పటికే ఉన్న రక్షణలను విస్తరించడానికి ప్లాట్‌ఫామ్ కార్మికుల ఉపాధి స్థితిని స్పష్టం చేయడం (పోర్చుగల్ & మారిషస్)

ఇప్పటివరకు, చాలా నియంత్రణ చొరవలు అధిక ఆదాయ దేశాల నుండి, ముఖ్యంగా యూరప్, ఉత్తర అమెరికా మరియు లాటిన్ అమెరికాలో నుండి వచ్చాయి. అందువల్ల, ఐఎల్ఓ యొక్క ప్రామాణిక-నిర్ణయ ప్రతిపాదన ప్రస్తుతం ప్లాట్‌ఫామ్ పని కోసం వారి స్వంత నియంత్రణ చట్రాలను రూపొందించే దేశాలకు ప్రపంచ సూచన బిందువును అందిస్తుంది

**భారతదేశంఅడుగు ముందుకు:**

ఐఎల్ఓ లో ఈ చర్చలు ప్రపంచ నిబంధనలను రూపొందిస్తున్నప్పటికీ. భారతదేశం తన ప్లాట్‌ఫామ్ వర్క్‌ఫోర్స్‌ను రక్షించుకోవడానికి గణనీయమైన జాతీయ సంస్కరణలను కూడా చేపట్టింది. సామాజిక భద్రతా నియమావళి (సిఎస్ఎస్) 2020 ప్లాట్‌ఫామ్ కార్మికులను ఒక ప్రత్యేక వర్గంగా గుర్తిస్తుంది మరియు జీవిత మరియు వైకల్య భీమా, ప్రమాద కవరేజ్, ఆరోగ్య మరియు ప్రసూతి ప్రయోజనాలు, పెన్షన్ పథకాలు మరియు క్రెచ్ సౌకర్యాలు వంటి సమగ్ర సంక్షేమ చర్యలకు పునాది వేస్తుంది. సిఎస్ఎస్ 2020 సామాజిక భద్రతా నిధిని మరియు పర్యవేక్షణ కోసం జాతీయ సామాజిక భద్రతా బోర్డును ఏర్పాటు చేయడాన్ని కూడా అందిస్తుంది.

**ఇ-శ్రమ్ డేటాబేస్‌తో ముందున్న భారత్:**

భారతదేశపు ఇ-శ్రమ్ పోర్టల్, జాతీయ డిజిటల్ డేటాబేస్, గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్‌తో సహా ఇప్పటికే 300 మిలియన్ల అసంఘటిత కార్మికులను నమోదు చేసింది, ఇది సంక్షేమ ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకుంది. 2025-26 కేంద్ర బడ్జెట్ ప్లాట్‌ఫారమ్ కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేయడం, ఇ-శ్రమ్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళీకృతం చేయడం మరియు ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద ఆరోగ్య సంరక్షణకు ప్రాప్యతను విస్తరించడం వంటి కీలక అంశాలతో ఈ శ్రామిక శక్తిని మరింత బలపరిచింది.

కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ యొక్క పైలట్ చొరవ ప్లాట్‌ఫారమ్ కార్మికులు మరియు అగ్రిగేటర్‌లను ఇ-శ్రమ్ పోర్టల్‌లోకి తీసుకురావడంలో చురుకుగా ఉంది. అర్బన్ కంపెనీ, జొమాటో, బిల్‌కిట్ మరియు అంకుల్ డెలివరీ వంటి ప్రధాన కంపెనీలు ఇప్పటికే ఈ ప్రయత్నంలో చేరాయి. అదనంగా, రాజస్థాన్ మరియు కర్ణాటక వంటి రాష్ట్రాలు చట్టాలను రూపొందించాయి మరియు జార?ండ్ గిగ్ కార్మికుల కోసం ప్రత్యేకంగా ముసాయిదా బిల్లులను ప్రతిపాదించింది, ఇవి ఈ కార్మికుల సామాజిక భద్రత కోసం చర్యలను అందిస్తాయి.

అయితే, ఉపాధి వర్గీకరణ యొక్క క్లిష్టమైన సమస్యను స్పష్టంగా పరిష్కరించకుండా ప్రధానంగా సామాజిక భద్రతా కవరేజీపై దృష్టి సారించినందుకు భారతదేశం యొక్క విధానం విమర్శలను ఎదుర్కొంది. అభివృద్ధి చెందుతున్న దేశంగా, భారతదేశం ప్లాట్‌ఫామ్ కార్మికులను రక్షించడం, ఆవిష్కరణలు, ఉద్యోగ సృష్టి మరియు ఈ రంగం అందించే వశ్యతను పెంపొందించడం అనే ద్వంద్వ సవాలును ఎదుర్కొంటుంది. కార్మికులను ఉద్యోగులుగా వర్గీకరిస్తే ప్లాట్‌ఫామ్‌ల ఖర్చులు 20-30శాతం పెరుగుతాయని అంచనాలు చూపిస్తున్నాయి. అయినప్పటికీ, లక్షలాది మంది పనితీరు గల కార్మికులకు సామాజిక భద్రతా కవరేజీని విస్తరించడం వారి పని పరిస్థితులను మెరుగుపరచడంలో ఒక ముఖ్యమైన స్టాప్‌గా మిగిలిపోయింది.

**భవిష్యత్తు దిశగా త్రైపాక్షిక చర్చలు:**

ఐఎల్ఓ లో జరుగుతున్న త్రైపాక్షిక చర్చలు ప్రపంచవ్యాప్తంగా పని భవిష్యత్తును రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. చివరికి ఒక కన్వెన్షన్ మరియు సిఫార్సును స్వీకరించడం ప్లాట్‌ఫామ్ పని నియంత్రణలో ఒక మలుపును సూచిస్తుంది మరియు గిగ్ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన నియంత్రణ అంతరాలను మూసివేయడంలో సహాయపడుతుంది. తదుపరి కీలక మైలురాయి సభ్య దేశాల ఆమోదం, ఇది ఈ అంతర్జాతీయ ప్రమాణాల వాస్తవ ప్రపంచ ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. ప్లాట్‌ఫామ్ కార్మికుల హక్కులను గుర్తించడానికి ఐఎల్ఓ చేస్తున్న చురుకైన ప్రయత్నాలు సకాలంలో మరియు ప్రశంసనీయమైనవి. ప్లాట్‌ఫామ్ కార్మికుల హక్కులు, రక్షణలు మరియు గౌరవప్రదమైన పని పరిస్థితులు విశ్వవ్యాప్తంగా గుర్తించబడి అమలు చేయబడుతున్నాయని నిర్ధారించుకోవడానికి ఈ రంగానికి అంతర్జాతీయ కార్మిక ప్రమాణాలను అభివృద్ధి చేయడం చాలా అవసరం.



ప్రొఫెసర్. శ్రీగౌరి కోసూరి
డిపార్ట్‌మెంట్ ఆఫ్ లేబర్ లా
సవీత స్కూల్ ఆఫ్ లా,
సవీత విశ్వవిద్యాలయం,చెన్నై.

## ఈనెల 26న సింగపూర్‌కి ఏపీ సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

ప్రతినిధులతో సమావేశం కానుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను వారికి వివరించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను కూడా తెలియజేస్తారు. ముఖ్యంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం మరియు మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రయత్నాలు జరగనున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు చేస్తున్న విదేశీ పర్యటనలు రాష్ట్రానికి ఎంతో ముఖ్యమైనవిగా భావిస్తున్నారు. గతంలో కూడా ఆయన పలుమార్లు విదేశాల్లో పర్యటించి భారీ ఎత్తున పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో సఫలమయ్యారు. సింగపూర్ పర్యటన కూడా అదే కోవలో జరుగుతుందని భావిస్తున్నారు.

ఈ పర్యటన ద్వారా సింగపూర్ మరియు ఆంధ్రప్రదేశ్ మధ్య సంబంధాలు మరింత బలపడతాయని ఆశిస్తున్నారు. అంతేకాకుండా, సింగపూర్ వంటి అభివృద్ధి చెందిన దేశాల నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని మరియు ఉత్తమ విధానాలను కూడా స్వీకరించడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

## తిరుమలలో జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం

- మొదటి పేజి తరువాయి

ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటారని ప్రాశస్త్యం ఉంది. ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యం అని అంటారు. చాతుర్మాస వ్రతం ప్రాచీన కాలం నుంచి ఆచనలో ఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి. ముందుగా శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి మఠంలో కలశ స్థాపన, కలశ పూజ, విష్వక్సేనారాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తరువాత సేకరించిన పుట్ట మన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం శ్రీ పెద్దజీయంగారు తిరుమల బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కనగల జీయ్యంగారి మఠం దగ్గరనుంచి శ్రీ చిన్నజీయంగారు , ఇతర శిష్యబృందంతో తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ స్వామి పుష్కరిణి, శ్రీ వరాహస్వామివారి బాలాలయాన్ని సందర్శించారు. అక్కడినుంచి మంగళవాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేశారు.

శ్రీవారి ఆలయ మహాద్వారం చెంత టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఇతర ఆలయ అధికారులతో కలిసి సంప్రదాయబద్దంగా

స్వాగతం పలికారు. శ్రీ జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్న తరువాత శ్రీ పెద్దజీయంగారికి మేల్‌చాట్ వస్త్రాన్ని, శ్రీ చిన్నజీయంగారికి నూలుచాట్ వస్త్రాన్ని బహూకరించారు. అనంతరం శ్రీపెద్దజీయర్ మఠంలో శ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీ చిన్నజీయర్‌స్వామి కలిసి ఈవో, అదనపు ఈవోలను శాలువతో సన్మానించారు.

## మా అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమే

- మొదటి పేజి తరువాయి

ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది. గతంలో పాకిస్థాన్ నుంచి “అణు బ్లాక్‌మెయిల్” కుట్రలు జరిగాయని ఆరోపణలు రావడంతో, భారత్ వాటిని ద్వైపాక్షికంగా ఎదుర్కొంటామని శపథం చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనే, భారత్ సింధు నదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీనికి ప్రతిస్పందనగా, పాకిస్తాన్ తమ “సంపూర్ణ బలంతో” ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఈ ప్రకటన అణు బెదిరింపుగానే భావించాల్సి ఉంటుందని విస్తృతంగా ప్రచారం జరిగింది. ఏప్రిల్ 22న పహల్గామ్ దాడికి ప్రతీకారంగా మే 7న భారత్ ‘ఆపరేషన్ సిందూర్’ను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్యలు చేపట్టారు.

ఈ నేపథ్యంలోనే షెహబాజ్ షరీఫ్ అణ్వాయుధాల గురించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. పాకిస్థాన్ యొక్క అణ్వాయుధ సామర్థ్యం దేశ భద్రతకు కట్టుబడి ఉందని, కానీ అది దౌర్జన్యం చేసేందుకు ఉద్దేశించినది కాదని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడటమే పాకిస్థాన్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## వైసీపీ నాయకుల్లో ఒక మహానటి ఉంది

- మొదటి పేజి తరువాయి

కుట్రలు చేస్తోందని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి పైశాచిక రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకుల్లో ఒక మహానటి ఉందన్నారు.

కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ వివాదంమంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ కారును టీడీపీ నాయకులు వదిలేశారని, అయితే ఆమె కావాలనే తిరిగి వచ్చి పోలీసులను, టీడీపీ నాయకులను దుర్భాషలాడారని ఆరోపించారు. ఈ సంఘటనను టీడీపీ నాయకత్వానికి అంటగట్టి, రాష్ట్రవ్యాప్తంగా బీసీలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా, ఆ ప్రయత్నంలో వైసీపీ విఫలమైందని ఆయన తెలిపారు. రాష్ట్రమంతా భగ్గుమనిపించాలని చూసి అడ్డంగా బుక్ అయిపోయారు... ఈ కుట్రల వెనుక వైసీపీ అధినేత జగన్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు.

లివైసీపీ రాక్షస రాజకీయాలు

వైసీపీ గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని కొల్లు రవీంద్ర విమర్శించారు. “వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని రావణకాష్ఠం చేయడానికి పూనుకున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు రాకుండా, పరిశ్రమలు ఏర్పాటు కాకుండా చేశారు. బీసీలను రెచ్చగొట్టి, కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు చేస్తున్నారు” అని ఆయన ఆరోపించారు. గుడివాడలో సభ పేరుతో రాద్ధాంతం సృష్టించడం, బీసీ మహిళను అడాం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూడటం వైసీపీ నీచ రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.

**జగన్ రెడ్డి హత్యా రాజకీయాలు**

వైసీపీ అధినేత జగన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించిన మంత్రి, ఒక దళిత వృద్ధుడిని కారుతో తొక్కించి చంపడం, వివేకానంద రెడ్డి హత్యను గుండెపోటుగా చిత్రీకరించడం వంటి ఆరోపణలు చేశారు. “పేర్ని నాని పామర్రు సభలో ‘చీకట్లో కన్ను కొడితే నరికేయాలి’ అని మాట్లాడారు. ఇలాంటి రాక్షస ఆలోచనలు వైసీపీ నాయకులకు సర్వసాధారణం” అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు మానవత్వం లేని పైశాచిక రాజకీయాలకు పాల్పడుతున్నారని, ప్రజలు వారి నీచ ఆలోచనలను గుర్తిస్తున్నారని హెచ్చరించారు.

**కూటమి అభివృద్ధి ప్రయత్నాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి రవీంద్ర తెలిపారు. “పెట్టుబడులు తీసుకొచ్చి, పరిశ్రమలు ఏర్పాటు చేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు మా నాయకులు తాపత్రయపడుతున్నారు. కానీ, వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని అశాంతిలోకి నెట్టాలని చూస్తున్నారు” అని ఆయన విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణం, స్టీల్ ప్లాంట్ లాభాల బాట, ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు ఆర్థిక సహాయం వంటి ప్రభుత్వ కార్యక్రమాలను ఆయన ఉదాహరించారు.

## రాజవొమ్మంగి నియోజకవర్గ స్థాయిలో మెరిసింది



**రాజవొమ్మంగి, పెన్ పవర్, జూలై 13 :** రంపచోడవరం నియోజకవర్గం స్థాయిలో నిర్వహించిన సుపరిపాలన డోర్ టు డోర్ కార్యక్రమంలో రాజవొమ్మంగి మండలం ప్రతిభ కనబర్చింది. మండల టీడీపీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు నాయకత్వంలో కార్యకర్తలు అశ్రాంతంగా శ్రమించి రెండో స్థానం సాధించడమే కాకుండా పార్టీ బలాన్ని నాడి చూపించారు. పార్టీ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లడం, ప్రజల వద్ద నమ్మకాన్ని పెంపొందించడం, ప్రభుత్వ వైఫల్యాలను విపక్షంగా ప్రజల్లోకి చర్చించడం ఇవన్నీ మాటలకాదు, కృషితో సాధించాల్సిన విజయాలు. అలాంటి విజయాన్ని సాధించినవారే భూత్ ఇన్‌చార్జులు అద్దేపల్లి చిన్నారావు, చెక్క లోవరాజు, బలబద్రి రాజుబాబు. వీరికి తగిన గౌరవాన్ని అందించేందుకు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆదేశాలతో, ఆదివారం గంగవరం మండలం నెల్లిపూడి గ్రామంలో జరిగిన తొలి సుపరిపాలన కార్యక్రమంలో వీరిని ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే శిరీష దేవి, విజయ భాస్కర్ హాజరయ్యారు.






## లారీ బోల్తా.... ఆరుగురు దుర్మరణం







**తిరుపతి పెన్ పవర్ జూలై 13 :** రెడ్డిపల్లి కట్టమీద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మామిడికాయల లోడుతో తిరుపతి వైపు వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ లారీలో సుమారు 18 మంది ఉండగా వారి మీద బోల్తా పడిన లారీ. ఇప్పటివరకు సుమారుగా ఆరుగురు మరణించినట్లు అంచనా.

## పాలనలో పారదర్శకత-కూటమి ప్రభుత్వం మీద ప్రజలకు విశ్వాసం

### మంత్రి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం, పెన్ పవర్ జూలై 13 :** ధర్మవరం ప్రజల గుండెల్లో ఎన్నాళ్ళుగానో పేరుకుపోయిన సమస్యలను తెలుసుకోవడమే ఈ పాదయాత్రల ఉద్దేశం. ఇల్లులు మంజూరయ్యాయని చెబుతారు-కానీ స్థలం ఎక్కడుందో తెలియదు. పట్టా ఇచ్చారు-కానీ దాని స్థితి ఏంటి తెలియదు. ఇలాంటి అనేక సమస్యల్ని ప్రజలు ఎదుర్కొంటున్నారు. నన్ను ఎంచుకున్న ప్రజలకు సమస్యలే పరిష్కారమయ్యే దారిలో తీసుకెళ్తానని ఇదే నా సంకల్పం, అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరం పట్టణంలోని 21వ, 22వ వార్డుల్లో ఆదివారం మూడవ రోజు నిర్వహించిన అభివృద్ధి పాదయాత్రలో మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను నేరుగా విన్నారు. ఈ పాదయాత్రలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ‚ ఇవాళ చాలా మందిని కలిసాను. ఇల్లు మంజూరైంది అని చెబుతున్నారు. కానీ స్థలం ఎక్కడుందో తెలియదు. పట్టా ఇచ్చారు-కానీ ఎక్కడ ఉందో తెలియదు. ఇది ప్రజలకు మిగిలిపోయిన అస్పష్టత. ఎందుకు హౌసింగ్ మరియు సచివాల సిబ్బందిని ఆదేశించడం జరిగింది స్థలాలను గుర్తించి, ఎవరు ఏ ఆప్షన్ కింద ఉన్నారో స్పష్టంగా రికార్డు చేయమని చెప్పడం జరిగింది. ఒక్కొక్కరి సమస్య వెనక నిజం తెలుసుకోవడమే పరిష్కారానికి మొదటి అడుగు. పెన్షన్ సమస్యలపై విషయానికొస్తే 75 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులు, అంగవైకల్యం, ఒంటరి మహిళలు-ఇవాళ పింఛన్లు లేవంటున్నారు. కారణం? పార్టీకి చెందిన వారంటూ గత ప్రభుత్వం రాజకీయంగా విడదీసింది. ఇది మానవతా విరుద్ధం. అర్హత ఉన్నవారికి పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. అదే నేను చేస్తున్నాను. అన్యాయంగా తీసేసిన ప్రతి పింఛన్ తిరిగి మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాను. ఈ బాధను రాజకీయ పరిగణనలో కాదని నిబద్ధతగా చూస్తున్నాం. మౌలిక సదుపాయాల విషయానికొస్తే ఇవాళ తాగునీటి సమస్యను ప్రతికూలంగా వినిపించాను. అమృత్ పథకంలో గతంలో మంజూరైన ట్యాంకుల నిర్మాణాలు పూర్తికాలేదు. అందుకే డైరెక్ట్ పంపింగ్ చేస్తూ తాత్కాలికంగా నీరు ఇస్తున్నాం. కానీ ఇది శాశ్వత పరిష్కారం కాదు. త్వరలో ట్యాంక్‌లు పూర్తవుతాయి. అప్పటివరకు నీటి పంపిణీ యథాశక్తి చేస్తాం. ఆ తర్వాత తాగునీటి సమస్య ఎక్కడా ఉండదు-ఇదే మా కృషి. అలాగే చేనేత సమస్యల విషయానికొస్తే ధర్మవరం చేనేతలకు కొత్త శక్తి ఇవ్వాలనే లక్ష్యంతో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌కు కేంద్రం ఇన్ ప్రిన్సిపల్ ఆమోదం తెలిపింది. కేంద్రం నుంచి 30 కోట్లు, రాష్ట్రం నుంచి 10 కోట్లు కలిపి మొత్తం 40 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నాం. మార్కెట్ యార్డులో స్థలాన్ని కేటాయించాం. టెండర్లకు సిద్ధంగా ఉన్నాం. ఇది 20 వేల మందికి ఉపాధిని కల్పించడమే కాక, మార్కెటింగ్ వ్యవస్థ కూడా చేనేతల చేతిలోకి వస్తుంది. అలాగే గత ఐదేళ్లలో పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ పాడయ్యాయి. ఎక్స్‌టెండెడ్ ఏరియాల్లో రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకే 87 కిలోమీటర్ల స్టేట్ హైవే అప్గ్రేడ్ చేయడానికి ప్రతిపాదనలు పంపించాం. ఇందులో 27 కిలోమీటర్ల బైపాస్ రోడ్ కూడా ఉంది. ఇది ధర్మవరం ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామన్నారు. అంతేకాకుండా ఇవాళ ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు-ఈ ఒక్క సంవత్సరం కూటమి పాలన చాలా సంతృప్తికరంగా ఉంది అని, వారు ఇప్పటికీ 33,000 కోట్లతో పింఛన్లు, 10,000 కోట్లతో తల్లికి వందనం, గ్యాస్ సబ్సిడీలు, రైతులకు మద్దతు వంటి పథకాలను గుర్తుచేస్తున్నారు. మళ్లీ వీటిని అమలు చేయగలిగిన నాయకత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపంలో, పవన్ కళ్యాణ్ రూపంలో ఉందని విశ్వాసంతో ఉన్నారు. ఇది మాకు బాధ్యతను మరింత పెంచుతోంది. అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ గారి నాయకత్వంపై ప్రశంసలతో మాట్లాడుతూ ‚ ఇవాళ దేశం మూడోసారి నరేంద్ర మోడీ గారిని ప్రధానిగా ఎన్నుకుంది. ఇది యాదృచ్ఛికం కాదు. ఇది ప్రజల విశ్వాసానికి నిదర్శనం. విశ్వనాయకుడిగా ఆయన ప్రపంచానికి నూతన భారతాన్ని చూపిస్తున్నారు. మన రాష్ట్రంలోనూ అదే రీతిగా ప్రజల ఆశలకి తగిన నాయకత్వం అందించేందుకు మేమంతా కృషి చేస్తాం. ఇది ఎలాంటి రాజకీయ విమర్శలకో, వయస్సు మీద కామెంట్లకో స్పందన కాదు. ఇది నిబద్ధతతో నడిపే శ్రమకు ప్రతిఫలం. పాదయాత్రలో ప్రజల నుంచి వందలాది వినతులు స్వీకరించిన మంత్రి, వెంటనే వాటిని అధికారులకు అప్పగించి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల బాధనే నా బాధ. వారి ఆశలే నా లక్ష్యం. నేను మాట ఇచ్చిన దానిని కచ్చితంగా నెరవేర్చే వరకు నడుస్తాను, వింటాను, పోరాడుతాను, అంటూ మంత్రి ధర్మవరం ప్రజల హృదయాలను స్పృశించేలా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ పాదయాత్రలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, టిడిపి పటన అధ్యక్షులు బిజెపి పట్టణ అధ్యక్షులు చంద్ర, రూరల్ అధ్యక్షులు చంద్ర, సుధాకర్, ఏపీ సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్య, మహేష్ చౌదరి, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు అడ్డగిరి శ్యామ, రాష్ట్ర బీసీ మహిళా అధ్యక్షురాలు జయశ్రీ, బిజెపి మహిళా నాయకురాలు కంచం లీలావతి, ఎన్డీఏ కూటమి నాయకులు ఫణి కుమార్, పురుషోత్తం గౌడ్, ఓబులేష్, పోతుకుంట రాజు, కేసగాళ్ల శ్రీనివాసులు, రాజారెడ్డి, డిష్ రాజు, ఎన్డీఏ కూటమి మహిళా నాయకురాలు, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### సందడే సందడి...

## 2000 పూర్వపు విద్యార్థులు



**కమలాపురం పెన్ పవర్ జూలై 13 :** కమలాపురం మండలం పెద్ద చెప్పల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో 2000 – 2001 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళన సభ నాటి విద్యాబోధన నేర్పిన గురువుల సమక్షంలో జరిపారు. అనంతరం పూర్వపు విద్యార్థులు స్నేహ పూర్వకంగా పలకరింపులతో స్కూలు ప్రాంగణం సందడి నెలకొంది. విద్యార్థులందరూ గురువులను అభినందించి వారి యొక్క ఆశీర్వాదాలు పొందారు.

## పీజీ పరీక్షలు తనిఖీ ..

### - రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, సీఈ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు




**కడప పెన్ పవర్ జూలై 13 :** యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల అనుబంధ పీజీ కళాశాలల రెండో సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను విశ్వవిద్యాలయ కుల సచివులు ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.ఎస్.వి.కృష్ణారావుతో కలసి తనిఖీ చేశారు. వైవియు పి.జి.కళాశాల కేంద్రాన్ని వారు పరిశీలించారు. విద్యార్థుల హాల్ టికెట్లను, వసతులను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 653 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 21 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు. కడప ఎస్వీ పీజీ కళాశాలలో, ప్రొద్దుటూరులోని ఎస్సీఎన్ఆర్ పీజీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్నాయని వివరించారు. విశ్వవిద్యాలయం నుంచి ప్రతి కేంద్రానికి అబ్జర్వర్లను పంపామని, ప్రత్యేకంగా హై పవర్ కమిటీ పరీక్షలను పర్యవేక్షిస్తుందని తెలిపారు.

## శాస్త్రోక్తంగా జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం



**తిరుమల పెన్ పవర్ జూలై 14 :** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం శ్రీశ్రీశ్రీ పెద్దజీయంగారి చాతుర్మాస దీక్ష సంకల్పం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. శ్రీ వైష్ణవ సంప్రదాయకర్త శ్రీ రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాస దీక్ష విశేషమైంది. ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటారని ప్రాశస్త్యం. కావున ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారు. చాతుర్మాస వ్రతం ప్రాచీనకాలం నుండి ఆచరణలో ఉన్నట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. ముందుగా శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి మఠంలో కలశ స్థాపన, కలశ పూజ, విష్వక్సేనారాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తరువాత సేకరించిన పుట్ట మన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం శ్రీ పెద్దజీయంగారు తిరుమల బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కనగల జీయ్యంగారి మఠం వద్ద నుండి శ్రీ చిన్నజీయంగారు మరియు ఇతర శిష్యబృందంతో బయల్దేరారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ స్వామి పుష్కరిణి, శ్రీ వరాహస్వామివారి బాలాలయాన్ని సందర్శించారు. అక్కడినుంచి మంగళవాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేశారు. శ్రీవారి ఆలయ మహద్వారం చెంత టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు, ఈవో శ్రీ జె.శ్యామలరావు, అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఇతర ఆలయ అధికారులతో కలిసి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీ జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్న తరువాత శ్రీ పెద్దజీయంగారికి మేల్‌చాట్ వస్త్రాన్ని, శ్రీ చిన్నజీయంగారికి నూలుచాట్ వస్త్రాన్ని బహూకరించారు. అనంతరం శ్రీపెద్దజీయర్ మఠంలో శ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీ చిన్నజీయర్‌స్వామి కలిసి ఈవో, అదనపు ఈవోలను శాలువతో సన్మానించారు.







## నగరంలో నార్త్ జోన్ విస్తృత స్థాయి సమావేశం

### - మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష





**కడప పెన్ పవర్ జూలై 13 :** కడప నగరం లోని నార్త్ జోన్ అధ్యక్షులు బీహెచ్ ఇలియాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కడప నగరంలోని ఇంటర్నేషనల్ కళ్యాణ మండపంలో నార్త్ జోన్ విస్తృత స్థాయి సమావేశం మరియు "బాబు షూరిటీ మోసం గ్యారంటీ" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ భాష, కడప నగర మేయర్ కే. సురేష్ బాబు డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన అంజాద్ భాష మాట్లా డుతూ "వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమాల పుట్టిన పార్టీ, పార్టీకి కార్యకర్తలే బలం. వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తాం. వాళ్ల సమస్యలు మా సమస్యలే," అని పేర్కొన్నారు. అలాగే, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో రానున్న ప్రభుత్వం 2.0లో అందరికీ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఆయన మాట్లాడుతూ, "ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఒక సంవత్సరం పూర్తి చేసుకుంది. కానీ ఇప్పటివరకు ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేక పోయారు. ప్రజలకు మోసం జరిగింది. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఇబ్బందులు కలిగించడాన్ని సహించం," అని స్పష్టం చేశారు. శాసనసభ్యురాలుగా "గెలిచిన మరుసటి రోజే 10 కార్లలో రవీంద్రనగర్‌లో వెళ్లి షామీర్య, లా కాలేజ్ బ్రిడ్జిలు ఆరు నెలల్లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కానీ ఏడాది దాటుతున్నా ఒక్క ఇటుక కూడా కదల లేదు," అని అంజాద్ భాష ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన జీవోలు ప్రస్తుతం డేట్లు మార్చి, వాటిని కొత్త జీవోలు చూపిస్తున్నారని ఆరోపించారు. "జనానికి అభివృద్ధి కావాలి కానీ, శాసన సభ్యురాలు ప్రచారపోకడలతో కాలం గడుపుతున్నారు. ప్రజల ముందు ఆమె సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది," అని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో నార్త్ జోన్ అధ్యక్షులు బీహెచ్ ఇలియాజ్, సౌత్ జోన్ అధ్యక్షులు ఐస్క్రీం రవి, వెస్ట్ జోన్ అధ్యక్షులు నాగేంద్ర రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు దేవి రెడ్డి ఆదిత్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు టిపి వెంకటసుబ్బమ్మ, జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షుడు గురు సాయి దత్త, నగర అనుబంధ అధ్యక్షులు కంచుపాటి బాబు, రాకింగ్ తన్వీర్, నందలూరు ఫయాజ్, చైతల్య, అశోక్ రెడ్డి, డాక్టర్ అజ్గార్ అలీ ఖాన్, నిశాంత్, కార్పొరేటర్లు చెన్నయ్య, అరిఫుల్లా, జిలాన్, షఫీ, చాక్లెట్ గౌస్, అలీ అక్బర్, షంషీర్, మహమ్మద్ రఫీ, బసవరాజు, మక్బూల్, పీరు, కో ఆప్షన్ సభ్యురాలు మరియ లు మహిళా నాయకులు ఉమామహేశ్వరి, సునీత రెడ్డి, రత్నకుమారి, మల్లేశ్వరి, శివమ్మ, పద్మ, నివేదిత, సుజిత, కమల్ బి తదితరులు ఉన్నారు.



## ఉచిత రెండు వారాల సర్టిఫికెట్ కోర్సు

## ఇంటర్ పాస్‌డ్ విద్యార్థులకు సువర్ణావకాశం



**మైదుకూరు పెన్ పవర్ జూలై 13 :** ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒక అరుదైన అవకాశాన్ని అందిస్తోంది. జూలై 14 నుండి 28 వరకు రెండు వారాల పాటు ఉచితంగా నిర్వహించే "బ్రిడ్జ్ టు బ్రిల్లియన్స్" సర్టిఫికెట్ కోర్సు ద్వారా విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, అనలిటికల్ స్కిల్స్, కంప్యూటర్ ప్రాథమికాలు, మరియు జీవన నైపుణ్యాలలో శిక్షణ పొందవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డా.పి. నారాయణ రెడ్డి తెలిపారు.

**ఈ కోర్సు ప్రత్యేకతలలో భాగంగా :** ఆంగ్ల అధ్యాపకులు శ్రీ రాధా రామ్ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణ, గణితశాస్త్ర నిపుణులు డా. ఎస్. నవనీశ్వర్ రెడ్డి ద్వారా అనలిటికల్ స్కిల్స్ శిక్షణ, కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో కంప్యూటర్ శిక్షణ మరియు

సాఫ్ట్ స్కిల్స్ ద్వారా వ్యక్తిత్వ వికాసం వీటిద్వారా విద్యార్థులు మంచి ఉద్యోగ అవకాశాలకు తగిన నైపుణ్యాలు సంపాదించవచ్చని తెలిపారు. కోర్సు పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్ కూడా అందజేయబడుతుంది. కావున మైదుకూరు నియోజకవర్గంలోని ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఆసక్తిగల వారు తగిన వివరాలతో కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## జూలై 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం

**తిరుమల పెన్ పవర్ జూలై 13 :** జూలై 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం రెండు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు. జూలై 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం ఘనంగా జరగనుంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని జూలై 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ కారణంగా ఈ రెండు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా ఇతరులకు టీటీడీ రద్దు చేసింది. జూలై 14, 15వ తేదిల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించిన సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సహకరించవలసినదిగా భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

## అదుపు తప్పి పడ్డ ఆయిల్ ట్యాంకర్



**వల్లూరు పెన్ పవర్ జూలై 13 :** వైఎస్ఆర్ కడప జిల్లా వల్లూరు దగ్గర రోడ్డు ప్రమాదం .కడప తాడిపత్రి జాతీయ రహదారి వల్లూరు దగ్గర ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఎవరికి ఇటువంటి హాని జరగలేదని సమాచారం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


## కడప ఆర్టీవో కార్యాలయం ముట్టడి

### లలిత గిరిజన హక్కుల పోరాట సంఘం




**కడప పెన్ పవర్ జూలై 13 :** పాత కడప దళితుల భూమి సమస్యను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని, ఉదయం 8:00 గంటలకు కడప ఆర్డీవో కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమనికి వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘ నాయకులతో పరిసర ప్రాంతాలలోని దళితులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

## అశ్వరుడాంబిక (గుఱ్ఱాలక్క) అమ్మవారి శాకాంబరి అలంకరణ





**అమలాపురం/సఖినేటిపల్లి పెన్ పవర్, జూలై 13 :** అంభద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం, అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి అనుబంధ దేవాలయం అయిన అశ్వరుడాంబిక (గుఱ్ఱాలక్క) అమ్మ వారు ఆషాడమాసం సందర్భంగా శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చినారు. శ్రీ గుర్రాలక్క అమ్మవారికి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం నుండి అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ నూతన వస్త్రాలు అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినారు. శ్రీ స్వామి వారి ప్రసాద విక్రయములు, ప్రత్యేక దర్శనములు, వివిధ సేవల ద్వారా రూ.87,585. లు అన్నదానట్రస్ట్ విరాళముల ద్వారా రూ.1,38,290 లు మొత్తం రూ.2,25,875 లు ఆదాయం వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్ వెంకట ప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పరివేక్షకులు విజయసారది, కిరణ్, నరసింహ, గణేష్, రాంబాబు, పాల్గొన్నారు.

# మన మాటలకుండే శక్తిని మనం గుర్తిస్తున్నామా?

### పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి

**కడప పెన్ పవర్ జూలై 13 :** రెండు కప్పలు.. ఒక కప్పల గుంపు తమ వ్యవహారాల గురించి మాట్లాడుకుంటూ హాయిగా అడవి గుండా నడుస్తోంది. నడుస్తూ ఉండగా, వాటిలో రెండు కప్పలు లోతైన ఒక గోతిలో పడిపోయాయి. మిగిలిన కప్పలన్నీ గొయ్యి చుట్టూ గుమిగూడి తమ సహచరులకు సహాయం చేయడానికి ఏమి చేయాలా అని ఆలోచించడం ప్రారంభించాయి. ఆ గొయ్యి చాలా లోతుగా ఉండడం చూసి అందరూ హతాశులయ్యారు. కప్పల గుంపు గొయ్యి చాలా లోతుగా ఉండడం వలన అవి ఎలాంటి సహాయం చేయలేవని అంగీకరించి, 'తమంతట తాముగా ప్రయత్నించి ఈ పరిస్థితి నుండి బయటపడలేవు కాబట్టి, తమ విధికి సిద్ధం అవ్వాలని' అవి గొయ్యిలో ఉన్న రెండు కప్పలకు చెప్పాయి. గోతిలోని రెండు కప్పలు ఈ భయానకమైన విధిని అంగీకరించడానికి సిద్ధంగా లేవు. తమ శక్తినంతా కూడదీసుకుని గెంతడం ప్రారంభించాయి. కొన్ని కప్పలు పైనుండి గొయ్యిలోకి చూస్తూ ఇలా అరిచాయి, "మీరు చేసే ప్రయత్నాలలో మీరు జాగ్రత్తగా ఉండకపోతే, మీ పరిస్థితి మరింత దిగజారవచ్చు." ఇది విన్న కప్పలు రెండూ గెంతుతున్నప్పుడు మరింత జాగ్రత్త పడ్డాయి. పైనుండి కప్పలన్నీ ,' శక్తిని ఆదా చేసుకోమని, ప్రయత్నాలను ఆపమని, ఇంక తాము చనిపోయినట్లుగా అంగీకరించమని', దుఃఖంతో అరిచాయి. కప్పలు రెండూ చాలా సేపు గెంతుతూనే ఉన్న కారణంగా చాలా అలసిపోయాయి. చివరికి, రెండు కప్పలలో ఒకటి తన సహచరుల మాటలకు విధేయతగా, నిరాశ, నిస్పృహలతో, తన విధికి తలవంచి, గొయ్యిలో మౌనంగా పడుకున్నాడు. ఈ మొదటి కప్ప చనిపోయినట్లుగా పైనుండి అరుస్తున్న కప్పలు ప్రకటించాయి. గొయ్యి లోపల ఉన్న మరొక కప్ప తన శరీరమంతా నొప్పితో బాధిస్తున్నప్పటికీ, పూర్తిగా అలసిపోయినప్పటికీ, శరీరంలో ప్రతి అణువులోని శక్తిని కూడదీసుకుని గెంతడం కొనసాగించింది. గొయ్యి పైన నిలబడి ఉన్న కప్ప సహచరులు, విధిని అంగీకరించమని, నొప్పిని ఆపుకోవడానికి, చనిపోమని అరుస్తున్నారు. ఆ కప్పలు అరుస్తున్న కొద్దీ, ఈ కప్ప ఇంకా ఎక్కువగా కష్టపడుతోంది. ఈ రెండో కప్ప పడుతున్న శ్రమను చూసి గుంత బయట ఉన్న కప్పలన్నీ అవాక్కయ్యాయి. చివరికి, కప్ప ఒక్కసారిగా బాగా ఎత్తుకు దూకి, చివరకు లోతైన ఆ గొయ్యి నుండి అందరూ చూస్తుండగా బయటకు వచ్చింది.

**కప్పలన్నీ ఆశ్చర్యపోయాయి!**

కప్పలన్నీ ఈ కప్పను చూసి సంతోషించి, చుట్టూ చేరి, "బయటకు రావడం అసాధ్యం అని మేం అరుస్తుంటే, నువ్వు ఎందుకు గెంతుతూనే ఉన్నావు?" అని అడిగాయి.

కప్ప అప్పుడు తాను కొద్దిగా చెవిటిదని చెప్పింది. వారందరూ సైగలు చేయడం, అరవడం చూసి, తన ప్రయత్నం చూసి వారు సంతోషిస్తున్నారని భావించానని, ఈ ప్రోత్సాహం తనని మరింత కష్టపడేలా చేసి, అన్ని విషమపరిస్థితులను అధిగమించి విజయవంతం అయ్యేందుకు ప్రేరేపించినట్లుగా చెప్పింది.

**ఒక సాధారణ కథ నుండి శక్తివంతమైన నీతి!**

మన మాటలు ఎవరినైనా నాశనం చేయగలవు, లేదా ఎవరైనా అభివృద్ధి చెందడానికి, వర్ధిల్లడానికి కారణం కావచ్చు. మన ప్రోత్సాహకరమైన మాటలు ఒకరి గాయాలను నయం చేయగలవు. మన విధ్వంసక పదాలు ఎవరికైనా లోతైన గాయాలను కూడా కలిగించగలవు. ఏ వ్యక్తి మాట అయితే మర్యాదపూర్వకంగా, నాగరికంగా, సంస్కారవంతంగా ఉంటుందో, వారు విశాలమైన, స్వచ్ఛమైన, ఉన్నతమైన హృదయాన్ని కలిగి ఉంటారు. తద్వారా ఇతరుల మనస్సులపై విస్తృతమైన ప్రభావాన్ని కలిగి ఉంటారు.



మానవ జీవిత లక్ష్యాన్ని సాధించడానికి ముందుగా కావలిసినది సంస్కారవంతమైన మాట.

**లాలాజీజి**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**
**అనువాదబృందం ఆంధ్రప్రదేశ్**

## బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



**కడప పెన్ పవర్ జూలై 13 :** కడప సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు స్వర్గీయ సట్నా నారాయణస్వామి వ్యక్తిగత గ్రంథాలయంలోని 400 పుస్తకాలను ఆయన భార్య సట్నా శాంతకుమారి, కుమారుడు ఉమాకాంత్, కోడలు రాజేశ్వరి, ఇతర కుటుంబ సభ్యులు ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణలకు అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో రామాయణ ఇన్ ఇండియన్ ఆర్ట్ అండ్ ఎపిగ్రఫీ, టెంపుల్ ఆర్కిటెక్చర్ అండ్ స్కల్ప్చర్ ఆఫ్ నోలంబాస్, జైనిజం (ఆర్ట్, ఆర్కిటెక్చర్, లిటరేచర్ అండ్ ఫిలాసఫీ), ది ఏన్సియంట్ జియాగ్రఫీ ఆఫ్ ఇండియా, ఎకనమిక్ హిస్టరీ ఆఫ్ అర్లీ ఇండియా, మాన్యువల్ ఆఫ్ కడప, తొలి చారిత్రక ఆంధ్రప్రదేశ్, సాహిత్య దర్శనం, శ్రీనాథుని సాహిత్య ప్రస్థానం, గానకళా బోధిని, మరపురాని మధురమైన గాథ లాంటి పలు విలువైన ఇంగ్లీషు, తెలుగు గ్రంథాలున్నాయన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించిన శ్రీమతి సట్నా శాంతకుమారి, సట్నా ఉమాకాంత్, రాజేశ్వరి, ఇతర కుటుంబ సభ్యులను యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ వైస్‌ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్ ఎం.మౌనిక, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## సభాభవన్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ

### ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్

### ఫోన్ చేయవలసిన ల్యాండ్ లైన్ నెం.08562-244437 : డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

**కడప పెన్ పవర్ జూలై 13 :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు.

**సభాభవన్ లో పిజిఆర్ఎస్ నిర్వహణ :**

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును. "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారులి. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు.

**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం :**

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

### నామవానిపాలెం సర్పంచ్

## భూపతి రాజు హఠాన్మరణం

### గ్రామంలో విషాదఛాయలు



**కాజులూరు, పెన్ పవర్, జూలై 13 :** కాజులూరు మండలంలోని నామవానిపాలెం గ్రామంలో విషాదం అలముకుంది. గ్రామ సర్పంచ్ భూపతి రాజు వెంకట సూర్యనారాయణ రాజు (చిట్టి రాజు) ఆదివారం ఉదయం హఠాత్ మృతి చెందారు. పొలంలో పనుల పర్యవేక్షణలో ఉన్న సమయంలో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల సాయంతో వెంటనే ఇంటికి తీసుకెళ్లినప్పటికీ, ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే తుదిశ్వాస విడిచారు.ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అమెరికాలో ఉండగా, చిన్న కుమారుడు విశాఖపట్నంలో ఉన్నాడు. కుటుంబ సభ్యుల ప్రకారం, పెద్ద కుమారుడు విదేశాలనుండి రాకపోవడంతో అంత్యక్రియలు మంగళవారం నిర్వహించను న్నారు.సర్పంచ్ చిట్టిరాజు మృతి వార్త గ్రామ ప్రజల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. రాజకీయవర్గాలతో పాటు సాధారణ ప్రజలు కూడా ఆయన మృతిని తట్టుకోలేక పోతున్నారు. ప్రజల సమస్యలపై శ్రద్ధ వహిస్తూ, అందరికీ అందుబాటులో ఉండే నాయకు డిగా చిట్టిరాజు గారు గ్రామస్థుల హృదయాలలో చెరిగిపోని ముద్ర వేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెంటనే నామవానిపాలెం చేరుకుని, చిట్టి రాజు గారి భౌతికకాయాన్ని సందర్శించి, కుటుంబానికి సాంత్వన తెలిపారు. ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.అలాగే టీడీపీ మండల అధ్యక్షులు డాక్టర్ చవ్వాకుల బాబు, పలువురు ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు,గ్రామస్థాయి అధికారులు పెద్దఎత్తున చిట్టి రాజు గారి ఇంటికి చేరుకుని నివాళులర్పించారు."ఒక మంచి మనిషిని కోల్పోయాం. ఎవరి దగ్గరకైనా వెళ్లినా ముందుగా చిట్టి రాజు గారి పేరు వినిపించేది," అని గ్రామస్తులు కన్నీటి స్వరంతో తెలిపారు.ఈ సందర్భంగా నామవానిపాలెం గ్రామమంతా శోకసంద్రంగా మారింది. సందడితో నిండాల్సిన వీధుల్లో నిశ్శబ్దం నెలకొంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని 'పెన్ పవర్' బృందం తరఫున మనఃపూర్వక సంతాపం తెలియజేస్తున్నాం.

## ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన శివరామ సుబ్రహ్మణ్యం



**అమలాపురం పెన్ పవర్ జూలై 13 :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అమలాపురం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ పచ్చిగోళ్ళ జనార్దన్ రావు కళ్యాణ మండపం, శ్రీ కొల్లూరి సత్యనారాయణమూర్తి ఉన్నయ్య మినీ కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివ రామ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. వివిధ విభాగాలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి, కార్యదర్శి కుసుమంచి పాపారావు, కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, మెడికల్ కమిటీ చైర్మన్ పచ్చిపులుసు కృష్ణారావు, వంకాయల కాశి, పోశెట్టి సూరిబాబు, లక్కీ శెట్టి బాబులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు యెందూరి సీతామహాలక్ష్మి, కొమ్మూరి ప్రసాద్ నంబూరి నరేష్, యెండూరి వేంకట్రామయ్యలు ప్రారంభించగా వందలాదిమంది వారి ఆరోగ్య రక్షణకై పరీక్షలు నిర్వహించుకున్నారు, ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు పల్లపోతు బంగారం, కోరుప్రోలు వేంకటేశ్వరరావు నంబూరి రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో వెరీ కోర్స్ వీన్స్, గుండె, ఆర్థోపెటి,క్ గ్యాస్ట్రో, స్కిన్, డెంటల్ ఈఎన్టీ జనరల్ మెడిసిన్ వంటి వైద్య విభాగాలకు సంబంధించిన వైద్య నిపుణులు పరీక్షలు చేసి వారికి అవసరమైన ఈసీజీ, ఏకో వంటి పరీక్షలు చేసి మందులు వ్రాయగా సుమారు మూడు లక్షల రూపాయలు విలువైన మందులను సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు ఉదయం నుంచి సాయంత్రం దాకా జరిగిన ఈ మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు, వారణాసి గుప్తా, కాళ్ళకూరి కుమార్, పచ్చిగోల్ల సోమరాజు, నూలు కృష్ణ, సుగ్గు గోపి వెస్సా ధృవ రాజారావు, అమలాపురం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి నూలు సూర్య ప్రభాకర్ రావు (సూరిబాబు) కోశాధికారి శ్రీకాకోళపు రాంపండు తదితరులు పాల్గొని వారి సేవలను అందించారు.

# రక్తదాన వారోత్సవాలు కడప లో రక్తదాన శిబిరం : చైర్మన్ జూటూరు

**కడప పెన్ పవర్ జూలై 13 :** కడప పట్టణంలోని ఇండియన్ రెడ్ క్రాస్ నందు కడప జిల్లా స్వచ్ఛంద సేవ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో, రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్ కుమార్ రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ యశస్వి పాల్గొన్నారు. అతిథులు సురేష్ కుమార్ మాట్లాడుతూ కడప జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థలు వారం రోజులు పాటు కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.. ప్రస్తుతం బ్లడ్ బ్యాంక్ నందు రక్త నిల్వలు చాలా తక్కువ ఆవశ్యకత ఉన్నాయని తెలిపారు.. కావున 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్యకరంగా ఉన్నవారు స్వచ్ఛందంగా రక్తదానం చేయుటకు ముందుకు రావాలన్నారు.. రక్తదానం చేయడం వల్ల పాత కణాలు పోయి కొత్త కణాలు రావడంతో ఎంతో ఆరోగ్యకరంగా ఉంటామని తెలియజేశారు. రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ యశస్వి మాట్లాడుతూ ఏ ప్రయోగశాలలోనూ తయారు అవ్వనిది రక్తం మాత్రమే అలాంటి రక్తాన్ని మనిషి మాత్రమే దానం చేయగలరని అన్నారు..రక్తదానం చేయడం ద్వారా ఎన్నో ఆరోగ్య లాభాలు ఉన్నాయని ఆ లాభాలను గురించి అవగాహన కలిగి రక్తదానం చేసేందుకు యువత నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పప్పులేటి శివాంజనేయ జూటూరు విజయ్ కుమార్, తారిఖ్, పట్టుపోగుల సుబ్బారావు, ఓబయ్య, గురు కిరణ్ తదిరలు పాల్గొన్నారు.



### మెరుగైన పాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం మంత్రి సుభాష్



**కె.గంగవరం పెన్ పవర్ జూలై 13 :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ద్వారానే మెరుగైన పాలన సాధ్యమని, ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం లోనే పేద ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ అభివృద్ధి పదంలో రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తుందని సీఎం చంద్రబాబు అనునిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం కె.గంగవరం మండలం పామర్రు, యండగండి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని స్థానిక ప్రజల వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తెలియజేస్తూ లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ దీర్ఘకాలిక ప్రణాళికలతో అనుభవజ్ఞుడైన సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు ముందుకు తీసుకెళుతున్నారని, ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను మై టిడిపి యాప్‌లో పొందు పరిచారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### అసాంఘిక కార్యకలాపాలపై
# పోలీసులు ఉక్కు పాదం

**సీతానగరం, పెన్ పవర్, జూలై 13 :** సీతానగరం మండలంలోని అచ్చియ్య పాలెం గ్రామ శివారులో ఆదివారం నాడు అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కు పాదం మోపారు. ఎస్సై డి. రామ్ కుమార్ కు వచ్చిన సమాచారం మేరకు 9 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 18 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. అదేవిధంగా మండలంలోని రఘుదేవపురం గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రెండు కోడి కత్తులు రెండు కోళ్లు 3500రూపాయలు నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు హాజరు పరుస్తామని తెలిపారు. అదేవిధంగాఎస్సై మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నాటు సారా నిర్మూలనపై చర్యలు

### ఒకరు అదుపులోకి.. సారా స్వాధీనం, ఊట ధ్వంసం

**రాజవొమ్మంగి, పెన్ పవర్ జూలై 13 :** చట్టవిరుద్ధ కార్యకలాపాలపై దృష్టిసారించిన పోలీసులు రాజవొమ్మంగి మండలంలోని భరతనాపల్లి పంచాయతీ పరిధిలోని చినరేలెంగిపాడు శివారులో చర్యలు చేపట్టారు. రిజర్వు అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ జరుగుతున్న సమాచారం మేరకు అధికారులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా నాటు సారా ఉత్పత్తిలో నిమగ్నమైన వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 6 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అదనంగా, తయారీలో ఉన్న 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సంబంధిత వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు.

**ఆరోగ్యానికి హానికరం-ప్రజల్లో చైతన్యం అవసరం :** నాటు సారా వంటి మత్తు పదార్థాలు ప్రజల ఆరోగ్యానికి హానికరం. ఇటువంటి కార్యకలాపాలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామాల్లో ఇలాంటి చట్టవిరుద్ధ చర్యలు గుర్తించినవారు వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు."మత్తు పదార్థాలను తృణంగా వీడి-ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ముందడుగు వేయాలి" అని అధికార వర్గాలు సూచించాయి.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 13 :** మండలంలోని చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. ఆలమూరు ఎస్సై జి.నరేష్ కథనం ప్రకారం శనివారం సాయంకాలం సుమారు 45 యేళ్ల వయస్సు కలిగిన వ్యక్తి పసుపు, నలుపు చారల టిషర్టు, ముదుర నీలం నిక్కర్స్ ధరించిన వ్యక్తి చికిత్స నిమిత్తం వచ్చి లోపలికి వెళ్లకుండానే క్రింద పడిపోయి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు, అంతలో వైద్యారోగ్య సిబ్బంది హుటాహుటీన లోపలికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. దీనిపై వైద్యాధికారి ఎన్.లక్ష్మీ స్నేహలత ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్సై నరేష్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించేందుకు స్థానికుల సాయంతో ప్రయత్నిస్తున్నారు. మండపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో మూడు రోజుల పాటు మృతదేహాన్ని ఉంచనున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

## ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ& గోపాల స్వామి దేవస్థానంలో వైభవంగా మాస కళ్యాణం





**ఆత్రేయపురం పెన్ పవర్ జులై 13 :** ఆత్రేయపురం మండలం ర్యాలిగ్రామం లో వెంచేసియున్న అతి పురాతన మైన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వారి దేవస్థానంలో శ్రవణ నక్షత్రానికి అనుగుణంగా నిర్వహించబడిన మాస కళ్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణ దర్శనం చేసి, అనేక కోరికల నిమిత్తంగా పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి నెల శ్రవణ నక్షత్రం రోజు నిర్వహించే ఈ మాస కళ్యాణానికి తదుపరి తేదీ 09.08.2025 అని నిర్వాహకులు తెలిపారు. వివాహం, సంతానం, విద్య, ఉద్యోగం, బదిలీ, పదోన్నతి, విదేశీయానము, ఆరోగ్యం, వ్యాపార అభివృద్ధి వంటి కోరికల నిమిత్తంగా భక్తులు ఈ మాస కళ్యాణంలో పాల్గొనవచ్చని సూచించారు. ఈ సేవలో పాల్గొనాలనుకునే భక్తులు ౦91 99113 34733 నంబరుకు సంప్రదించి, ఆన్లైన్ ద్వారా రూ.750 చెల్లించి తమ పేరును నమోదు చేయవచ్చు. పూజలో పాల్గొన్న వారికి స్వామివారి ప్రసాదాన్ని పోస్టు ద్వారా పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా, నల్గొండకు చెందిన దేవసాని ఇందిర సౌమ్య మరియు బచ్చు జలజ స్వామివారిని దర్శించి, జ్ఞాపకార్థంగా శ్రీ స్వామి వారి అన్నదాన పథకానికి రూ.5,116 విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థానం వారు వారిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# పట్టణంలో సుపరిపాలన తొలి అడుగు





**అమలాపురం పెన్ పవర్ జూలై 13 :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుల మేరకు శాసనసభ్యులు అయితా బత్తుల ఆనంద్ రావు, ఆముడా చైర్మన్ అల్లాడ సోంబాబు ఆదేశాల మేరకు పట్టణంలోని 11, 13, 14 వార్డులలో "సుపరిపాలన- తొలి అడుగు" కార్యక్రమం పట్టణ పార్టీ అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో క్లస్టర్ ఇంచార్జ్ పెచ్చెట్టి విజయలక్ష్మి, కో క్లస్టర్ కర్రి రామస్వామి (దత్తుడు, యూనిట్ ఇంచార్జ్ వాసంశెట్టి చిన్న బాబు, నల్లా స్వామి ఇంటింటికి వెళ్ళి కలిశారు. ఈ కార్యక్రమంలో 13 వ వార్డు అధ్యక్షులు కట్టా నాని, వరదా సత్యనారాయణ,11వ వార్డ్ గుబ్బల నాగబాబు, 14వ వార్డు అధ్యక్షులు గెల్లా మీనా కుమారి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా రాజోలు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**అమలాపురం /మలికిపురం పెన్ పవర్, జూలై 13 :** మలికిపురం మండలం విశ్వేశ్వరపురం గ్రామంలో ఎమ్మెల్యే ఇంటి వద్ద కూటమి నాయకులు కార్యకర్తలు ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ కూటమి నాయకులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి నాయకులకు కార్యకర్తలు కేక్ ను పంచారు. రు.సుమారుగా 4,000 మంది ఈ బర్త్డే వేడుకలో పాల్గొని ఎమ్మెల్యే దేవ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. గజమాల తో ఎమ్మెల్యేని సత్కరించి సన్మానించిన ఎన్డీఏ నాయకులు,ఎమ్మెల్యే మాట్లాడుతూ నా జీవితంలో మొదటిసారిగా ఇటువంటి వేడుకల్లో నా పుట్టినరోజు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే దేవ తెలియజేశారు. వీర మహిళలు ఎమ్మెల్యే భారీ పోటో ప్రారంభించి, ప్రత్యేక హారతులు అందించారు.ఈ కార్యక్రమంలో జి. నరసింహరావు,దిరిశాల బాలాజీ, పి బుజ్జి, ఎంపిపి సత్యవాణి, ఏ బాబ్జినాయుడు, రావూరి నాగు,కూటమి నాయకులు,కార్యకర్తలు, వివిధ శాఖల ప్రభుత్వాధికారులు, ఎమ్మెల్యే అభిమానులు, వీర మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా నూకాలమ్మకు సారె



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 13 :** పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో కొలువైన నూకాలమ్మ అమ్మవారికి ఆదివారం సారె పేరుతో ప్రత్యేక నివేదన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమ, వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలు, ఫలాలు, స్వీట్లు సమర్పించారు. దేశం సస్యశ్యామలంగా ఉండి పాడిపంటలతో తులతూగేందుకు ప్రతీ సంవత్సరం ఆషాఢ మాసంలో అమ్మవారికి సారె సమర్పించడం జరుగుతుందని భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూకాలమ్మ దేవస్థానం పరిధిలో భక్తుల రాకతో సందడి సందడిగా మారింది.



## ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూలై 13 :** పి.అంకంపాలెం గ్రామ కమిటీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా నార్లపాటి మహేష్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, పోలవరం నియోజకవర్గ ఇన్చార్జి విస్సంపల్లి సిద్దు మాదిగ తెలిపారు. శనివారం రాత్రి పి అంకంపాలెం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ , అనుబంధ కమిటీలు ఎన్నుకున్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ నార్లపాటి చిన్న మాదిగ ఆధ్వర్యంలో ఈ గ్రామ కమిటీని ఎన్నిక చేసినట్లు తెలిపారు. కోటా త్రిమూర్తులు మాదిగ, కోట వెంకట సాయి కార్తీక్ మాదిగ, కలపాల చందు మాదిగ ప్రచార కార్యదర్శుల గా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా మహాజన సోషలిస్ట్ పార్టీ పి అంకంపాలెం గ్రామ కమిటీ అధ్యక్షులుగా కోటా శ్రీను మాదిగ, ఉపాధ్యక్షులుగా తగరం పాలయ్య మాదిగ, కార్యదర్శిగా నార్లపాటి వెంకటేశ్వరరావు మాదిగతో పాటు 16 మంది కమిటీని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఖమ్మం పాటీ మల్లికార్జున మాదిగ, బొడ్డపాటి రమేష్ మాదిగ, కంభంపాటి జాను మాదిగ, చేపల రాజేంద్ర బాబు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

### నగర పంచాయతీ సిసి రోడ్ల ప్రారంభించిన ఎంపీ హరీష్



**అమలాపురం/ ముమ్మిడివరం పెన్ పవర్ జూలై 13 :** నగర పంచాయతి 3 వార్డు కాశివారితూము నుండి చింతలమెరక ఐ.టి.ఐ.కాలేజి వరకూ 19 వార్డు కనుమూరి సత్యనారాయణరాజు ఇంటి నుండి రుద్రరాజు రామరాజు ఇంటి వరకు 2024-25 సం. అమలాపురం పార్లమెంట్ సభ్యుల నిధులు సుమారు రూ.50 లక్షలతో నిర్మాణం చేసిన సి.సి.రోడ్లను పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధూర్ బాలయోగి, ప్రభుత్వ విప్, శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు,ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.రవివర్మ, చెల్లి అశోక్,దాట్ల పృధ్వీరాజు, గుత్తుల సాయి, ఫ్లోర్ లీడర్ ఎం.బాలకృష్ణ, తాడి నరసింహారావు, గుద్దటి జమ్మి, గోదాశి పుండరీష్, దొమ్మేటి రమణ కుమార్, గొల్ల పల్లి గోపి, కడలి నాగు, యాళ్ల ఉదయ్, కట్టా సత్తిబాబు, పిల్లి నాగరాజు, విళ్ళ వీర స్వామి నాయుడు, రెడ్డి సుధీర్, మెండి కమల, ఎ.ఇ.కె.శ్రీనివాస్, ఆర్.పి.లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, సచివాలయ, మెప్మా నగర పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

## మల్లిశాలలో సుపరిపాలనలో తొలి అడుగు



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 13 :** జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామంలో క్లస్టర్ ఇంచార్జ్ పైడిపాల సూరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. తల్లికి వందనం, గృహాల మంజూరు, ఇంటి స్థలం మంజూరు, ఎన్టీఆర్ పెన్షన్, తదితర సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తూ కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని సమాంతరంగా అందిస్తూ ఏడాది సుపరిపాలన పూర్తిచేసుకుని తొలి అడుగు వేయడం జరిగిందని దీనిని ప్రజలందరికీ తెలియజేయాలని ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఈ కార్యక్రమం తీసుకున్నామన్నారు. ఇంటింటికి తిరుగుతూ మీకు జరిగిన అభివృద్ధి సంక్షేమం, జరగవలసిన అభివృద్ధి సంక్షేమం మీ సమస్యలను తెలుసుకుంటూ రేపు రాబోయే రోజుల్లో ఇంకా మీకు ఏం కార్యక్రమాలు చేపట్టాలని అంశాలను కార్యాచరణ రూపొందించుకుంటున్నామని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, పైడిపాల సత్తిబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, కానవరెడ్డి రామకృష్ణ, పల్లికొండ భద్రం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుమ్మల్ల అనంతలక్ష్మి, ముత్తా రాజబాబు, సియాధుల పెద్దకాపు, కానవరెడ్డి శ్రీను, చాత్ర జగ్గారావు, జొన్నాడ వీరబాబు, జాజుల శ్రీను, సియా దుల శివరామకృష్ణ, బొమ్మిడి చక్రం పాల్గొన్నారు.

### సొసైటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కుర్ల చినబాబు



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 12 :** కిర్లంపూడి కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ గా కుర్ల చినబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.ఆయన తోపాటు డైరెక్టర్లుగా నియమితులైన వేలంక గ్రామానికి చెందిన గండే రాయుడు,బూరుగుపూడి గ్రామానికి చెందిన పాటంశెటి వెంకటలక్ష్మి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కుర్ల చినబాబు, మాట్లాడుతూ రైతులకు సహకార సంఘం ద్వారా పూర్తి స్థాయిలో ప్రభుత్వం అందించే అన్ని సేవలు అందించడం జరుగుతుందన్నారు. రైతులకు అన్ని విధాల సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ తో పాటు డైరెక్టర్లను పలువురు టిటిడి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పూలమాలలతో శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదరం చంటిబాబు, టిడిపి నాయకులు తూము కుమార్, కాళ్ళ వెంకటేష్, గుడాల రాంబాబు, పాఠం శెట్టి రవి, కాశీ,గండే చినరాజు, కందా సత్యానందం, కర్ణాకుల పెదకాపు, సొసైటీ సీఈఓ పంపన రమణ,పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో ఏడాది వ్యవధిలో ఎన్నో విజయాలు

### - కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆత్రేయపురం పెన్ పవర్ జులై 13 :** ఏడాది కాలం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, సంక్షేమం మరియు అభివృద్ధి రంగాల్లో అనేక విజయాలు సాధించిందని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా ముచ్చటించి, కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు పెండెం వెంకన్న, మాజీ సర్పంచ్ పేర్చర్ల పుల్లం రాజు వర్మ, మెర్ల నాగేశ్వరరావు, మద్దూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**వైసీపీ పాలనపై విమర్శలు :** గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనను ఎద్దేవా చేస్తూ, ఆ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా క్షీణించిందని, పాలనా వ్యవస్థ పూర్తిగా స్థంభించిందని ఆరోపించారు. "వైసీపీ విధ్వంస పాలన వల్ల రాష్ట్రం అధోగతికి వెళ్లింది. కానీ కూటమి అధికారంలోకి వచ్చాక ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టాం," అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**సంక్షేమానికి ప్రాధాన్యం :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజలకు నమ్మకం కలిగించడంలో కూటమి ప్రభుత్వం ముందంజ వేస్తోందన్నారు. ముఖ్యంగా :

వృద్ధుల పింఛన్‌ను రూ.4,000కి పెంచడం.. తల్లికి వందనం', 'దీపం' వంటి పథకాల ప్రారంభం..

మెగా డీఎస్సీ ప్రకటన అన్నదాత సుఖీభవ పథకానికి ఏర్పాట్లు పూర్తవటం పీఎం కిసాన్ ద్వారా రైతులకు నగదు జమ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.



**అభివృద్ధికి దిక్సూచి :** గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పల్లెల్లో అభివృద్ధి అసలు కనిపించలేదని, కూటమి అధికారంలోకి వచ్చాక పల్లెల్లోనే అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. "ఇది ప్రజలకు మళ్లీ ప్రభుత్వంపై విశ్వాసం కలిగించింది," అని వ్యాఖ్యానించారు.

**ప్రజల నుంచి విశేష స్పందన :**

సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ప్రభుత్వ పథకాలు ఎలా మానవ హితానికి ఉపయోగపడుతున్నాయో ప్రతి ఇంటికీ చాటి చెబుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన కూటమి నాయకులు పాల్గొన్నారు.

## "బాబు ష్యూరిటీ అంటే మోసం గ్యారంటీ"

- వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- హామీలు అమలు చేయకపోతే ఉద్యమం తప్పదు





**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 13 :** "చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజలకు వివరిద్దాం, ఆయన హామీలు కేవలం ఓట్ల కోసం ఇచ్చిన అబద్ధపు మాటలు మాత్రమే!" అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. పెద శంకర్లపూడి గ్రామంలో నిర్వహించిన ఏగులమ్మ తల్లి జాతరలో పాల్గొన్న ఆయన, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన "బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ" ప్రచార కార్యక్రమంలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ "ఇంట్లో తల్లికి, పిల్లలకు వందనం అంటూ మాట్లాడిన బాబు, ఆ పిల్లల భవిష్యత్తునే మోసం చేశాడని, ఎన్నికల్లో గెలవాలన్న దాహంతో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి, ప్రజల్ని దగా చేశాడని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రచారం కేవలం విమర్శలకే పరిమితముకాకుండా, క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజాభిప్రాయం సేకరించడం వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం మరింత స్పష్టమవుతుందని ఆయన చెప్పారు. "చంద్రబాబు మోసాలు ఇంటింటికీ తెలియజేయాలి. ప్రజలకు వాస్తవాలు వెల్లడించి, ఆ మోసాల వెనుక దాగిన రాజకీయ కుట్రను బట్టబయలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిశెట్టి నాని, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవింద్, దలే చిట్టిబాబు, ఏపూరి రామారావు, దలే నల్లబాబు, గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ, జువ్విన వీర్రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలి

### ఆదివాసి గౌడ సంక్షేమ సంఘం డిమాండ్





**గంగవరం, పెన్ పవర్, జూలై 13 :** జీవో నెంబర్ 3 పునరుద్ధరించి గిరిజనులకు న్యాయం చేయాలని ఆదివాసి గౌడ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం గంగవరంలో ఆదివాసి గౌడ సంక్షేమ సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీవో నెంబర్ 3 రద్దు చేయడం వల్ల ఆదివాసీలు తీవ్ర నష్టం చూడవలసి వచ్చిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలగజేసుకుని రద్దు చేసిన జీవో నెంబర్ 3 చట్టబద్ధత కల్పించి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. అలాగే కుల ధృవీకరణ పత్రాల జారీ విషయంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. అలాగే త్వరలో ఆదివాసి గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి సంఘం సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మొత్తంగా ఉన్న ఆదివాసి గౌడ లందరూ ఏకం చేసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మట్ట రామ్మూర్తి, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు అప్పలస్వామి, దుర్గారావు, అల్లూరి జిల్లా గౌడలు ఉద్ధారావు, రామ్మూర్తి గౌడ్, మట్ట రాజు, గూడవల్లి ప్రభాకర్ ,భద్రం ,రమేష్, అర్జున్ ,లక్ష్మణ్ ,గంగరాజు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక :** ఆదివాసి గౌడ సంక్షేమ సంఘం అల్లూరి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం గంగవరంలో నిర్వహించారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా మట్ట రామ్మూర్తి గౌడ్ ,ఉపాధ్యక్షులుగా కిల్లో త్రినాథ్ గౌడ్ ,ప్రధాన కార్యదర్శిగా నండూరి భాస్కర్ రావు గౌడ్, కోశాధికారిగా పాంగి రామకృష్ణ, కార్యదర్శిగా బుర్ర శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివాసి గౌడ సంక్షేమ సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఎరువులు, పురుగుమందుల డీలర్ల సంఘ అధ్యక్షుడిగా వీర్రాజు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 13 :** తాడేపల్లిగూడెం మండలం ఎరువులు పురుగుమందులు డీలర్ల అధ్యక్షునిగా మోదుగుంటకు చెందిన సిద్ధ వీర్రాజు అధ్యక్షుడిగా ఎన్ని కయ్యారు. తాడేపల్లిగూ డెంలో నెల సంఘ సమావేశం లో మండలంలోని డీలర్లు ఈ మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా జనార్ధన్ గంగరాజు ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీకి డీలర్లు మద్దుకూరు ధనరాజు, చిక్కాల సత్యనారాయణ, జడ్డు హరిబాబు, తదితరులు అభినందనలు తెలిపారు.

### కూటమి అభివృద్ధిని వివరించిన

## ఎంపీ హరీష్ మంత్రి సుభాష్ ఎమ్మెల్యే బుచ్చిబాబు





**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ , పెన్ పవర్ జులై 13 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం,ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్,ముమ్మిడివరం ఎమ్మెల్యే ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో కలిసి ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొన్నారు. 19వ వార్డులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమాన్ని అభివృద్ధిని వివరించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చే సూచనలను, సలహాలను స్వీకరించడం జరిగింది. రామచంద్రాపురం నియోజక వర్గం పామర్రు, యండగండి గ్రామాలలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొన్నారు.

## ఏడాది పాలనలో ఎన్నో విజయాలు సుపరిపాలనలో తొలిఅడుగు



**అమలాపురం/సఖినేటిపల్లి పెన్ పవర్, జులై 13 :** కూటమి ఏడాది పాలనలోనే ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి అనే రెండు అంశాల్లో ఎన్నో విజయాలు సాధించామని టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టిడిపి మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు సఖినేటిపల్లి మండలం ఉయ్యూరివారి మెరక మధ్య గ్రూపులో ఆదివారం నాడు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీనివాస్, సతీష్ బాబు ఇంటింటికి వెళ్లి కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ అరాచక పాలన వల్ల రాష్ట్రం అధోగతి పాలైందని, కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్ది ఏడాది పాలనలోనే పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంపు, తల్లికి వందనం, దీపం, మెగా డీఎస్సీ వంటి హామీలు ప్రతిష్టాత్మకంగా అమలు చేసిందని తెలిపారు. 'అన్నదాత సుఖీభవ' పథకం అమలుకు కసరత్తు పూర్తయిందని, పీఎం కిసాన్ పథకంతో పాటు నగదు జమవుతుందని తెలిపారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు జరుగుతుందన్నారు. ఈ విధంగా ' సూపర్ సిక్స్' హామీల్లో ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు కూటమి ప్రభుత్వం శతధా కృషి చేస్తుందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సైతం కూటమి ప్రభుత్వం పరుగులు పెట్టిస్తుందని తెలిపారు. పల్లెల్లో వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క అభివృద్ధి కూడా చేపట్టలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధులు జరిగాయని వారు తెలిపారు. అందుకే సుపరిపాలనలో తొలి కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, టిడిపి నాయకులు తాడి సత్యనారాయణ, చెల్లుబోయిన జయబాబు, చెల్లుబోయిన నాగబాబు, సుంకర అమర జ్యోతి కుమార్, సుంకర సూర్యనారాయణ, హరరాజు, సుధాకర్, సలాది దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## శాలివాహనలు అందరూ సంఘితంగా ఉండాలి





**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 13 :** శాలివాహనులు సంఘితంగా ఉండాలని రాజకీయంగా వెనుకబడి ఉన్నారని కూటమి ప్రభుత్వము గుర్తించి శాలివానులకు ఒక ఎమ్మెల్సీ కేటాయించాలని కోరినారు. అంబాజీపేట మండలం మాచవరం శాలివాహన సంక్షేమ సంఘ బిల్డింగ్ నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సమావేశము దాలిపెత్తి భీమేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలోని 22 మండలాల శాలివాహన సంఘ నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో శాలివాహనులు రాజకీయంగా వెనకబడి ఉన్నారని కూటమి ప్రభుత్వము గుర్తించి శాలివానులకు ఒక ఎమ్మెల్సీ ని కేటాయించాలని, శాలివాహన కార్పొరేష కు అధిక నిధులు కేటాయించి శాలివానలకు న్యాయం చేయాలని కోరినారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కానసీమ శాలివాహన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులుగా త్రిమూర్తులు ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు మానేపల్లి వీరబ్రహ్మం గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శాలివాహన సంఘ నాయకులు కోనసీమ జిల్లా సలహాదారుడు దొడ్డిపట్ల శ్రీనివాస్, మంతెన శ్రీ నివాస్ వెల్ల త్రిమూర్తులు కొడమంచిలి సూరిబాబు తానేలంక వెంకటేశ్వరరావు ఏడిద నాగరాజు వెల్ల శ్రీనివాస్ పాలకొల్లు వెంకటరమణ అంబటి వెంకట సుబ్రహ్మణ్యం దొడ్డిపట్ల శ్రీరామచంద్రమూర్తి ఆదుర్తి ఓం నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ సేవల శిబిరం రేపటి నుంచి



**రాజవొమ్మంగి, పెన్ పవర్ జూలై13 :** ప్రజల ఆధార్ వివరాల్లో ఉన్న పొరపాటులను సరిచేయడం, ఇంకా ఆధార్ పొందని వారికి అవకాశం కల్పించడం ద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హులను చేరువ చేయడం లక్ష్యంగా ప్రభుత్వం గ్రామస్థాయిలో ఆధార్ శిబిరాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా రాజవొమ్మంగి మండలంలోని శరభవరం గ్రామ సచివాలయంలో జూలై 14, 15, 16 తేదీల్లో ఆధార్ సేవల శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యాదగిరేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ శిబిరంలో ఆధార్ అప్‌డేట్‌లు, కొత్త ఆధార్ నమోదు, చైల్డ్ ఆధార్ కార్డులు, చిరునామా మార్పులు, బయోమెట్రిక్ అప్డేట్లు వంటి సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్, పింఛన్, విద్యుత్ సబ్సిడీ, పాఠశాల విద్య, ఆరోగ్య సేవలు వంటి అనేక పథకాల వాడకానికి ఆధార్ తప్పనిసరి కావడంతో, ప్రతి ఒక్కరు తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

## శాకాంబరీ అలంకారంలో నూకాలమ్మ



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 13 :** పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో భక్తుల పాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న నూకాలమ్మ అమ్మవారు ఆదివారం శాకాంబరీ దేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారి మూలవిరాట్టు, అర్చా మూర్తి, ఆలయ ప్రాంగణం, ఉపాలయాలను వివిధ రకాల కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఒకప్పుడు కరువుకాటకాల సమయంలో దేవతల ఆరాధనను మన్నించిన దేవి శతాక్షితా అవతరించి జీవరాశులన్నింటికి అవసరమైన ఆహారం, కూరగాయలు, పాడి పంటలు. జీవజలాలన్నింటినీ ఆమె శరీరం నుంచి విడుదల చేసి కాపాడిందని, ప్రజలకు కావాల్సిన శాకాలను సృష్టించినందుకు ఆమెను శాకంబరిగా కొలుస్తారని, ఈక్రమంలో శాకంబరీ ఉత్సవాలను అమ్మవారి ఆలయాలలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈ సందర్భంగా పండితులు వివరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తున్న నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నూకాలమ్మ దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. రాంబాబురెడ్డి తెలిపారు.

## 108లు ప్రసవాలపై స్పందించిన సిపిఎం




**అడ్డతీగల, పెన్ పవర్ ,జూలై 13 :** రంపచోడవరం ఏరియా హాస్పిటల్ కు రంపచోడవరం నియోజవర్గంలో ఉన్నటువంటి పిహెచ్‌సి నుండి గర్భిణీ స్త్రీలకు ఇబ్బంది కలిగితే, రంపచోడవరం ఏరియా హాస్పిటల్ కు రిఫర్ చేస్తారు. అటువంటిది రంప చోడవరం ఏరియా హాస్పిటల్ లోనే సుఖప్రసవం కాదు అని రాజమండ్రి రెఫర్ చేసినప్పుడు, మార్గమధ్యలో ఏరియా హాస్పిటల్ కి ఐదు కిలోమీటర్ల పరిధిలో సులభంగా 108లో ప్రసవం జరగడంఅధికారుల నిర్లక్ష్యణానికి నిలువెత్తు నిదర్శమని, సిపిఎం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు లోత. రామారావు చర్వాణి ద్వారా తీవ్రంగా ఖండించారు. అధికారులు పనిచేస్తున్నారా,లేక నిద్ర వ్యవస్థలో ఉన్నారా ఐటిడి అధికారులు పర్యవేక్షణ లోపమా, గిరిజనులప్రాణాలపై ఇంత నిర్లక్ష్యమా 11 మండలాల నుంచి వచ్చేటువంటి కేసులను పర్యవేక్షించే ఏరియా హాస్పిటల్ లో ఇంత నిర్లక్ష్యమా అధికారి యంత్రాంగం ఏం చేస్తుంది దీనిపై ప్రశ్నిస్తున్న మహిళ నాయకురాలు మట్లవాని తీవ్రంగా స్పందించారు. ఈవిషయంపై ఐటిడి అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి గిరిజన మహిళలకు న్యాయం చేయాలని ఆమె తీవ్రంగా ఖండించారు. వైద్య వృత్తిలో ఉండి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమెసందర్భంగా అన్నారు. 108 లో ప్రసవాలు జరుగుతున్నాయి, అంటే డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని వారు రిఫర్ చేసిన తర్వాత హాస్పటల్ కు కొద్దిపాటి ద్వారంలోనే ప్రసవం జరగడం సిగ్గుచేటని ,ఇటువంటి పరిణామాలు మరొక్కసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆమెఈ సందర్భంగా హెచ్చరించారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### టీడీపీ నాయకుడు సానిపిన రామకృష్ణ



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 13 :** పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని టీడీపీ నాయకుడు సానిపిన రామకృష్ణ అన్నారు. పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ఎలాంటి రాజకీయ జోక్యం, పైరవీలు, షరతులు లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్న క్యాంటీన్లు, తల్లికి వందనం, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఆమలులోకి రానుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులపై ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు.

## ధనధాన్య లక్ష్మి అమ్మవారి ఆలయంలో సారె శోభాయాత్ర





**కె గంగవరం పెన్ పవర్ జూలై 13 :** కే గంగవరం మండలం కోటిపల్లి రోడ్డులోని కోట వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ ధనధాన్య లక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా సారెను ఘనంగా సమర్పించారు.చుట్టుపక్క గ్రామాల నుండి భక్తులు మంగళ వాయిద్యాలతో, వేద మంత్రోచ్చారణల నడుమ శోభాయాత్రగా సారెను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు.ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయచ్చుకున భక్తులకు ఆ సారెను పంపిణీ చేశారు.

# 'కంచం పొత్తు, మంచం పొత్తు'... క్లారిటీ ఇచ్చిన తీన్మార్ మల్లన్న!



**హైదరాబాద్ పెన్ పవర్:** తాజాగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆఫీసుపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. బీఆరెస్స్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పలువురు కార్యకర్తలు దాడికి దిగారు! కవిత చేస్తున్న బీసీ ఉద్యమాన్ని మల్లన్న తప్పుబడుతూ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో జరిగిన ఘటనపై మల్లన్న రియాక్ట్ అయ్యారు. అవును... తన కార్యాలయంపై జాగృతి కార్యకర్తల దాడిపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పందించారు. ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా... ఎమ్మెల్సీ కవిత, ఆమె కుటుంబం తనపై హత్యాయత్నానికి తెగబడిందని ఆరోపించారు. 'కంచం పొత్తు, మంచం పొత్తు' వ్యాఖ్యలపైనా వివరణ ఇచ్చారు. తాజాగా హైదరాబాద్ లో మీడియాతో ఆయన మాట్లాడారు. తన కార్యాలయంపై జరిగిన దాడిలో తన చేతికి గాయమైందని.. తన గన్ మెన్ నుంచి తుపాకీ లాక్కుని కాల్పులు జరిపేందుకు కవిత అనుచరులు యత్నించారని.. ఈ తరహా దాడులు చేసినంత మాత్రాన బీసీలు, అణగారిన వర్గాలను అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాము చేసే ప్రయత్నం ఇసుమంత కూడా తగ్గదని తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు. ఇలాంటి పనులకు తాను భయపడనని.. ఈ విషయాన్ని రాసి పెట్టుకోవచ్చని.. రానున్న మూడేళ్లలో మిమ్మల్ని రాజకీయంగా పాతాళానికి తొక్కే బాధ్యత మాది అంటూ మల్లన్న మండిపడ్డారు. ఈ సందర్భంగా... కేసీఆర్, కేటీఆర్ లపై ఉన్న ఫ్రస్ట్రేషన్ తమపై చూపిస్తామంటే కుదరదని చెప్పిన మల్లన్న... ఇలాంటి దాడులతో మరింత దిగజారి చులకన కావడం తప్ప ఇంకేమీ ఉండదన్నారు. ఈ నేపథ్యంలో కంచం పొత్తు, మంచం పొత్తు అంటే వియ్యం అందుకోవడమని.. తాను ఆ ఉద్దేశ్యంతోనే అన్నానని.. కనీస అవగాహన లేకుండా కవిత కిరాయి రౌడీలను పంపించి దాడి చేయించారని అన్నారు. తాను ఒకవేళ తలదించుకోవాల్సి వస్తే అది బీసీ బిడ్డలవద్దే కానీ.. కల్వకుంట్ల దొరల కాళ్ల దగ్గర కాదని మల్లన్న వ్యాఖ్యానించారు. అసలు.. బీసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై తాము పోరాడుతుంటే మధ్యలో కవితకు ఎందుకు బాధ? అని ప్రశ్నించిన తీన్మార్ మల్లన్న... ఉనికి కోసం అయితే కేసీఆర్ ను అడగాలని సూచించారు.

# ఒక ఊరికని బయలుదేరితో మరో దేశంలో దింపిన పాక్ ఎయిర్ లైన్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా బస్సుల్లోనూ, రైళ్లలోనూ నిద్రపోయో, మరిచిపోయో గందరగోళానికి గురైన ప్రయాణికులు ఒక చోట దిగల్సింది పోయి మరోచోట దిగిన ఘటనలు చాలానే ఉంటాయి.. ఈ విషయంలో చాలా మందికి స్వానుభవం కూడా ఉంటుందని అంటారు. అయితే... ఇలాంటి ఘటన విమాన ప్రయాణం విషయంలో జరిగితే ఎలా ఉంటుంది? తాజాగా పాక్ ఎయిర్ లైన్స్ విషయంలో అదే జరిగింది! అవును... ఓ ఊరు వెళ్లాల్సిన ప్రయాణికుడిని, ఇంకో దేశంలోకి తీసుకెళ్లి వదిలేసింది పాక్ ఎయిర్ లైన్స్. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పాకిస్థాన్ లో లాహోర్ నుంచి కరాచీకి బయల్దేరాడు షాజహాన్ అనే వ్యక్తి. ఈ సమయంలో స్థానిక ఎయిర్ పోర్టుకు చేరుకొని, దేశీయ విమానాలు ఆగే డొమెస్టిక్ టెర్మినల్ నుంచి లోపలికి ప్రవేశించాడు. కరాచీ వెళుతుందని భావించిన ఓ విమానంలోకి ఎక్కాడు. ఆ సమయలో అతడు లోపలికి వెళుతున్నప్పుడు సిబ్బందికి టికెట్ చూపించాడం, వారు అనుమతించడం.. అతడు లోనికి వెళ్లి కూర్చోవడం అన్నీ టకటకా జరిగిపోయాయి. విమానం ప్రయాణం ప్రారంభించింది. అయితే.. లాహోర్ నుంచి దగ్గరలోనే ఉన్న కరాచీకి 1:45 సమయం పడుతుంది. కానీ.. రెండు గంటలైనా రాకపోయే సరికి అతడికి అనుమానం వచ్చింది. దీంతో.. సిబ్బందిని పిలిచి రెండుగంటలు దాటినా విమానం కరాచీకి ఎందుకు చేరలేదని ప్రశ్నించాడు. దీంతో కంగుతినడం సిబ్బంది వంతైంది. ఆ తర్వాత కాసేపటికి తేరుకొని ప్రయాణికుడిదే తప్పు అని రివర్స్ లో మొదలుపెట్టారు. ఈ సమయంలో.. కనీసం తనను తిరిగి కరాచీకి చేర్చాలని కోరినా... ఆ ప్రాసెస్ కు మూడ్రోజుల సమయం పడుతుందని చెప్పారు. అయితే.. లాహోర్ విమానాశ్రయంలో ఇంటర్నేషనల్ టెర్మినల్ కు మరమ్మతులు నిర్వహిస్తుండటంతో డొమెస్టిక్ టెర్మినల్ వద్దే వాటినీ ఉంచడంతో ఏర్పడిన గందరగోళం కారణంగానే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు. మరోవైపు మరోవైపు ఈ విషయంపై స్పందించిన పౌర విమానయాన శాఖ.. సదరు ప్రైవేటు ఎయిర్ లైన్స్ సంస్థకు భారీగా ఫైన్ విధించింది.

# విమాన ప్రమాద మృత్యుంజయుడు పరిస్థితి ఇప్పుడెలా ఉందో తెలుసా?

**హైదరాబాద్ పెన్ పవర్:** అహ్మదాబాద్ లో జూన్ 12న జరిగిన ఎయిరిండియా విమానం ఘోర ప్రమాదం అందరినీ ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో విమానంలో ప్రయాణిస్తున్న 242 మందిలో ఒకే ఒక్క ప్రయాణికుడు విశ్వాస్ కుమార్ గాయాలతో సజీవంగా బయటపడ్డారు. దీంతో.. ఆయనను మృత్యుంజయుడు అని సంబోధిస్తున్నారు నెటిజన్లు. ఈ సమయంలో ఆయన తాజా పరిస్థితిని కుటుంబ సభ్యులు వివరించారు. అవును... అహ్మదాబాద్ విమాన ప్రమాదం నుంచి అనూహ్యరీతిలో ప్రాణాలతో బయటపడ్డారు మృత్యుంజయుడు విశ్వాస్ కుమార్. ప్రమాదం అనంతరం ఆయన నడుచుకుంటూ అంబులెన్స్ ఎక్కిన దృశ్యాలు నెట్టింట వైరల్ గా మారాయి. ఇదే సమయంలో.. ఆ విమానంలో ఆయన సీటు నెంబర్ ఏ11 కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పైగా ఇటీవల విమాన టిక్కెట్ల బుక్కింగ్స్ లో ఏ11 సీటుకు డిమాండ్ పెరిగిందని అంటున్నారు. ఆ సంగతి అలా ఉంటే... ఆ ఘోర ప్రమాదం నుంచి బయటపడి మృత్యుంజయుడిగా ఉన్నప్పటికీ.. విశ్వాస్ ఇంకా ఆ భయానక క్షణాలను మరచిపోలేకపోతున్నారని.. ఆయనను ఇప్పటికీ నాటి భయానక క్షణాలు, దృశ్యాలు వెంటాడుతూనే ఉన్నాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రధానంగా... ప్రమాద దృశ్యాలతో పాటు ఘటనలో సోదరుడిని కోల్పోవడం వంటి వాటితో విశ్వాస్ మానసికంగా తీవ్రంగా కుంగిపోయాడని తెలిపారు. ఆయన అర్ధరాత్రి సమయంలో నిద్రలోంచి హఠాత్తుగా మెల్కొంటున్నారని.. ఇక తిరిగి నిద్రపోవడం లేదని తెలిపారు. ఇదే సమయంలో.. ఇప్పట్లో మళ్లీ లండన్ కు వెళ్లే ప్రణాళికలు లేవన్నారు. ఇంట్లో వాళ్లతో కూడా సరిగా మాట్లాడటం లేదని.. ఆయన క్షేమం గురించి తెలుసుకునేందుకు విదేశాల్లో నివసిస్తున్న బంధువులు ఫోన్ లు చేస్తున్నా మాట్లాడలేకపోతున్నట్లు వెల్లడించారు. తిరిగి మామూలు మనిషిని చేసేందుకు మానసిక చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు! కాగా... బ్రిటన్ లో నివాసముంటున్న విశ్వాస్ కుమార్.. ఇటీవల గుజరాత్ లోని తన కుటుంబాన్ని కలిసేందుకు వచ్చి, తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నాడు వైరల్ అయ్యాయి. ఇదే సమయంలో... విమానం కూలిన వెంటనే అగ్నిగోళం మండుతుండగా, నల్లని పొగ అంతెత్తున చుట్టూ అలుముకోగా.. వాటి పక్కనుంచి విశ్వాస్ కుమార్ నడుచుకుంటూ వచ్చేస్తున్నారు. ఈ వీడియో మరింత సంచలనంగా మారిన సంగతి తెలిసిందే! ఈ క్రమంలో... నాడు శరీరానికి తగిలిన గాయాలు మానినా... మానసికంగా తగిలిన షాక్ నుంచి మాత్రం ఆయన ఇంకా తేరుకోలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

# ఆమంచి చేరేది ఆ పార్టీ గూటికేనా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రకాశం జిల్లాలో ఆమంచి క్రిష్ణ మోహన్ ఒక కీలక నేతగా ఉన్నారు. ఆయన రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దివంగత మాజీ సీఎం రోశయ్య శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చిన ఆమంచి క్రిష్ణ మోహన్ బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు. కాంగ్రెస్ తో సుదీర్ఘకాలం అనుబంధం ఆయనకు ఉంది. మధ్యలో తెలుగుదేశం, వైసీపీలలో కూడా ఆయన రాజకీయం చేశారు. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ లో ఉన్నారు.

షర్మిల పీసీసీ చీఫ్ అయిన తరువాత కాంగ్రెస్ లో చేరిన ఏకైన బలమైన నేత ఎవరైనా ఏపీలో ఉన్నారు అంటే అది ఆమంచి క్రిష్ణ మోహనే అని చెప్పాలి. అంతే కాదు 2024లో పోటీ చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో అత్యధిక ఓట్లు తెచ్చుకున్నదీ ఆయనే కావడం విశేషం. రీసెంట్ గా షర్మిల జిల్లా పర్యటనలో భాగంగా ఒంగోలులో కార్యకర్తల సభ పెడితే దానిని బాగా నిర్వహించిది కూడా క్రిష్ణ మోహనే. కాంగ్రెస్ లో బలమైన నేతగా ఉన్న క్రిష్ణ మోహన్ వచ్చే ఎన్నికల కోసం తీవ్రంగానే ఆలోచన చేస్తున్నారు అని అంటున్నారు. ఆయన 2029 ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ నుంచి పోటీ చేయరు అని అంతా అంటున్నారు. 2024లో అయితే వైసీపీ నుంచి బయటకు వచ్చి అప్పటికే కిటకిటలాడుతున్న కూటమి వైపు వెళ్ళలేక ఆయన కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు అని అంటారు. ఇక ఆయన ఇపుడు తన భవిష్యత్తు రాజకీయం గురించి ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. టీడీపీలో చేరేందుకు అవకాశం లేదని అంటున్నారు. దానికి కారణం చీరాల నియోజకవర్గాన్ని ఆయన కోరుకుంటారు. అక్కడ ఆ పార్టీకి సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నారు. ఇక జనసేనలో చేరవచ్చు కానీ పొత్తులో చీరాల టీడీపీకే పోతుంది అని అంటున్నారు.



దాంతో ఆయనకు తాజాగా వైసీపీలో చోటు చేసుకున్న పరిణామాలు కలసి వస్తున్నాయని అంటున్నారు. చీరాల నుంచి కరణం వెంకటేష్ ని తప్పించి అద్దంకికి వైఎస్ జగన్ షిఫ్ట్ చేశారు. అద్దంకి కూడా కరణం ఫ్యామిలీకి బలమైన స్థావరం. పైగా 2024లో కరణం ఫ్యామిలీకి చీరాల టికెట్ ఇస్తే ఓటమి పాలు అయ్యారు. దాని వల్ల ఆమంచి కృష్ణమోహన్ కూడా పార్టీకి దూరం అయ్యారని పార్టీ భావిస్తోంది. ఇపుడు చీరాల వైసీపీ ఖాళీగా ఉంది. బలమైన నాయకుడు ఆ పార్టీకి కావాలని అంటున్నారు. అదే సమయంలో ఆమంచికి కూడా బలమైన పార్టీ వచ్చే ఎన్నికల కోసం కావాలని అంటున్నారు. జగన్ మీద ఆమంచికి కోపం లేదని అలాగే ఆమంచికి కూడా జగన్ విషయంలో ఏమీ ఫిర్యాదులు లేవని అంటున్నారు. దాంతో రెండు వైపుల నుంచి అవసరాలు ఆమంచిని తిరిగి వైసీపీ గూటి వైపుగా నడిపిస్తాయని అంటున్నారు. దీని కోసం సరైన ముహూర్తమే కుదరాలని అంటున్నారు. బహుశా లోకల్ బాడీ ఎలక్షన్స్ కి ముందు ఆమంచి క్రిష్ణ మోహన్ తిరిగి ఫ్యాన్ పార్టీ నీడకు చేరుకోవచ్చు అని జిల్లాలో ప్రచారం అయితే సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# జగన్ ని పొగిడిన పచ్చ చానల్...ఇదే వైరల్!

**హైదరాబాద్ పెన్ పవర్:** జగన్ జనం క్రేజ్ ఆయన గ్రేట్ ఇలాంటి మాటలు వైసీపీ వారు వందిమాగధులు అంటే మామూలుగా ఉంటుంది. ఆ సౌండ్ కూడా పెద్దగా ఉండదు. కానీ జగన్ అంటే పడని ఆయన పార్టీ పొడగిట్టని ఒక చానల్ వైసీపీ వారి దృష్టిలో పచ్చ చానల్ గా ముద్రపడిన ఒక మీడియా జగన్ ఏ రేంజిలో పొగిడిందో చూస్తే కనుక భూమి దద్దరిల్లిపోయేలా బిగ్ సౌండ్ వస్తుంది. అంతే కాదు టీడీపీ కూటమికి బహుశా షాక్ తినే పరిస్థితి వస్తుందేమో అంటున్నారు. మన గురించి మన వారు కాదు అవతల వారు పొగిడితే ఆ కిక్కే వేరు దానికి వచ్చే లెక్కే వేరు అని అంటారు. ఇపుడు సరిగ్గా అదే జరుగుతోంది. జగన్ గురించి ఒక పచ్చ చానల్ రాసిన తనదైన విశ్లేషణ కూటమిలో అతి పెద్ద చర్చకు దారి తీస్తూంటే వైసీపీ వర్గాలు అయితే పండుగే చేసుకుంటున్నాయి. జగన్ కి ఏముంది జస్ట్ పదకొండు సీట్లే కదా అని లైట్ తీసుకోకూడదన్నట్లుగా ఒక హెచ్చరికగా కూడా ఈ విశ్లేషణ ఉంటే ఉండొచ్చు. కానీ అందులో జగన్ ని మామూలుగా అనుకోవద్దు ఆయన వ్యూహాలు ఎత్తుగడలు వేరే లెవెల్ అని పొగడకుండానే పొగడడం చూసిన వారు మాత్రం ఏమిటి ఇది అనుకోవాల్సిందే. ఒక రాజకీయ నాయకుడిగా జగన్ ది పదిహేనేళ్ళ ప్రస్థానం. అందులో ఆయన పాదయాత్రలని మరో యాత్రలను జనం మధ్యలో 2019 దాకా తిరిగారు. ఇక ఓటమి తరువాత కేవలం ఏడాది మాత్రమే అయింది. జగన్ రోడ్ల మీదకు వస్తూంటే జనాలు పోలోమని వెంటపడడం ఏ రకమైన సంకేతం అని సదరు పచ్చ చానల్ ప్రశ్నిస్తోంది. ఒక సినీ స్టార్ కి ఉండే క్రేజ్ జగన్ కి ఉందని చెప్పకనే చెబుతోంది. అంతే కాదు అయిదేళ్ల టీడీపీ ప్రతిపక్ష పాత్రను వైసీపీతో పోల్చుతూ అబ్బే ఆ రోజులలో టీడీపీ కోలుకోవడానికి కనీసంగా మూడు నాలుగేళ్ళు పట్టిందని దెప్పిపొడుస్తోంది. పైగా 2024 ఎన్నికల వేళ కూటమి కట్టి అధికారం దక్కుతుందన్న సంకేతాలను ఇస్తూన్నా చంద్రబాబు సభలకు వచ్చిన జనాలతో పోలిస్తే ఈ రోజున తొలి ఏడాది కూటమి పాలన ముగిసిన తరువాత జగన్ సభలకు వస్తున్న జనాలే ఎక్కువ అని అంటోంది.

జగన్ భయం అనే పెట్టుబడితో అధికార కూటమిని కట్టడి చేస్తున్నారని కూడా చప్పడమూ విశేషమే. జగన్ పర్యటించే చోట్ల ఆయా జిల్లాలకు చెందిన కూటమి మంత్రులు ఎమ్మెల్యేలు



ఆయన మీద విమర్శలు చేయలేకపోతున్నారు అంటే ఇది ఏ రకమైన భయం అని కూడా ప్రశ్నిస్తున్నారు. మరో వైపు చూస్తే జగన్ హయాంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ టీడీపీ నేతల మీద వేధింపులు ఉండేవని, అలా వారు బయటకు రావడానికే భయపడ్డారని కానీ ఇపుడు వైసీపీ వారు అలా లేరని మేమే మళ్ళీ అధికారంలోకి వస్తున్నామని వారు చెబుతున్న మాటలు చేస్తున్న ప్రకటనలతో కూటమిలో సైతం ఒక రకమైన భావన ఏర్పడినట్లుగా కనిపిస్తోంది అని అంటున్నారు.

జగన్ మళ్ళీ వస్తారేమో అన్న భావనతో అధికార యంత్రాంగం కూడా చురుకుగా పనిచేయడం లేదని సదరు చానల్ ఆక్షేపించింది. అంతే కాదు కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదని మెతక ప్రభుత్వం అన్న భావన జనంలోకి వెళ్తోంది అని చెబుతోంది. ఇక చంద్రబాబుకు కూటమి ప్రభుత్వం మీద పట్టు లేకుండా పోయింది అని కూడా నిశితమైన విమర్శలే చేసింది. రాష్ట్రంలో ఉన్నది కూటమి ప్రభుత్వమా లేక జగన్ ప్రభుత్వమా అన్నది టీడీపీ కార్యకర్తలే ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది అని అంటోంది. ప్రత్యర్ధి పక్షాన్ని భయపెట్టడంలో జగన్ విజయవంతం అయ్యారని కూడా మెచ్చుకోలు మాటలు చెబుతోంది. యావత్తు టీడీపీకి పిరికితనం ఆవహించింది అని కూడా నిందలేస్తోంది.

మరో వైపు కూటమి నాయకులు మంత్రులు ఎమ్మెల్యేలు ఎవరూ కార్యకర్తల బాధలను పట్టించుకోవడం లేదని ఘాటైన విమర్శలే చేసింది. నిజంగా జగన్ బలపడ్డారా అని కూటమి నేతలు ఆరా తీసే పరిస్థితి వచ్చిందంటే జగన్ చూపిస్తున్న భయం ఏ రేంజిలో ఉందో అర్ధం చేసుకోవాలని అంటోంది. ఈ రోజున జగన్ కి వ్యతిరేకంగా ప్రకటనలు చేయడానికి కూడా ఎవరూ ముందుకు రావడం లేదని పేర్కొంటోంది. ఇక జగన్ ని నిలువరించే విషయంలో టీడీపీ కూటమి పూర్తిగా విఫలం అయింది అని కూడా విమర్శించారు. జగన్ అధికారంలో ఉన్నపుడు ఒక ఉద్యమాన్ని కూడా చేయడానికి టీడీపీ వారు భయపడితే ఇపుడు ఏడాది అయినా తిరక్కముందే మేము అధికారంలోకి వస్తే అందరికీ సినిమా చూపిస్తామన్న స్థాయిలో వైసీపీకి రావడం అంటే ఆలోచించాల్సిందే అన్నది పచ్చ చానల్ ఉవాచ. ఇలా జగన్ గురించి అన్నీ పాజిటివ్ గా రాస్తూ ఆయన పెడుతున్న భయాన్ని పిరికిగా టీడీపీ భరిస్తోందని ఆక్షేపించడం అంటే ఇది వైసీపీ శ్రేణులకు ఆనందపరచే విశ్లేషణగానే చూస్తున్నారు. దీంతో సోషల్ మీడియాలో ఎన్నడూ లేనిది పచ్చ చానల్ నుంచి వచ్చిన ఈ రాజకీయ వ్యాఖ్యానాన్ని వైసీపీ వారే పోస్టు చేస్తూ తెగ వైరల్ చేస్తున్నారు అదే సమయంలో దటీజ్ జగన్ అని వైసీపీ యూట్యూబర్లు కూడా లెక్కకు మిక్కిలిగా పోస్టులు చేసి వదులుతున్నారు. మీరు పిరికివారు అని మీ ఇంటి పత్రిక మీ నట్టించి చానలే చెప్పిందిగా అంటూ రెట్టిస్తున్నారు. ఈ మొత్తం పరిణామాల నేపథ్యంలో చూస్తే టీడీపీ కూటమికి ఈ వ్యాఖ్యానాలు ఏ మాత్రం మింగుడు పడడం లేదు అంటున్నారు అదే సమయంలో వైసీపీ ఫుల్ జోష్ లో ఉంది. ఇంతకీ ఈ రాజకీయ విశ్లేషణ రాసింది సదరు పచ్చ చానలేనా అన్నంతగా ఇది ఉందంటే తమాషా మామూలుగా లేనట్లే.

# జమిలి ఎన్నికలు జరిగేనా......ఆర్ఎస్ఎస్ ప్రభావమెంత ?




**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో జమిలి ఎన్నికలు అంటూ ఇటీవల కాలంలో భారీగా ప్రచారం సాగుతోంది. కేంద్రం తీసుకున్న నిర్ణయానికి సుప్రీంకోర్టు కూడా ఆమోదం తెలపడంతో ఇంకేముంది జమిలి జోరుగా వచ్చేస్తోంది అని అనుకున్నారు. ఈ నెల 21 నుంచి జరిగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో జమిలి బిల్లుని ప్రవేశపెట్టి ఆమోదించుకుంటారు అని కూడా ప్రచారం సాగింది. అయితే ఇపుడు చూస్తే ఒక్కసారిగా సీన్ మారుతోందా అన్న చర్చ సాగుతోంది. జమిలి ఎన్నికలు నిజంగా జరిగితే 2027 చివరిలో కానీ జరిగేట్టుగా లేదు. అంత టైట్ గా పొజిషన్ ఉంది. పైగా జనాభా గణన, కులగణన పూర్తి కావాలి. వాటి నివేదికలు రావాలి. ఇక పార్లమెంట్ సీట్లలో డీలిమిటేషన్ జరగాలి. ఇవన్నీ పూర్తి అయ్యేసరికి 2027 పూర్తి అవుతుందని అంటున్నారు. ఇక మిగిలింది 2028. ఒకే ఒక ఏడాది అన్న మాట. మరి ఇంతలా ఆత్రపడినా ముందస్తు ఎన్నికల కోసం తాపత్రయం తప్ప మరేమీ కాదని దానికి బదులు షెడ్యూల్ ప్రకారం 2029లో ఎన్నికలకు వెళ్తే అయిదేళ్ళ పాటు అధికారంలో ఉండొచ్చు కదా అన్న చర్చ సాగుతోందిట. మరో వైపు చూస్తే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తాజాగా జరిగిన ఒక సభలో మాట్లాడుతూ 75 ఏళ్ళు నిండిన వారు రాజకీయాల నుంచి తప్పుకుంటే మేలు అన్న మాట వాడారు. అది నేరుగా ప్రధాని మోడీకే తగులుతుందని అంటున్నారు. మరో రెండు నెలలలో ఆయన 75 ఏళ్ళు పూర్తి చేసుకోబోతున్నారు. అయితే ఆయన ఇప్పటికే ప్రధానిగా ఉన్నారు కాబట్టి మధ్యలో ఆయన తప్పుకోవడం జరగదని అంటున్నారు. ఏది జరిగినా వచ్చే ఎన్నికల తరువాతనే అని అంటున్నారు. అయితే ఆ వచ్చే ఎన్నికలు ఎంత ముందుగా వస్తే అంత ముందుగా మోడీ మాజీ ప్రధాని అవుతారా అన్న చర్చ కూడా సమాంతరంగా వస్తోంది. పైగా మోడీ పక్కకు తప్పుకుంటే ప్రధాని పీఠం ఎక్కేందుకు బీజేపీలో చాలా మంది పోటీలో ఉన్నారని ప్రచారం సాగుతోంది. ఎటూ ఆర్ఎస్ఎస్ మనసులో మాట ఏంటో తెలిసింది కాబట్టి చాలా మంది బాహాటం అవుతారని కూడా అంటున్నారు. దాంతో జమిలి ఎన్నికలు అని ఏణ్ణర్థం ముందే పదవిని మోడీ వదిలేసుకుంటారా లేక 2029లో షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు పెట్టి మంచి మెజారిటీతో గెలిచి మరో సారి తానే పీఎం గా ఉంటారా అన్నదే ఇపుడు చర్చగా ఉందిట. ఏది ఏమైనా జమిలి ఎన్నికలు జరుగుతాయా లేదా అన్నది ఒక చర్చ. దాని మీద సాధ్యాసాధ్యాల గురించే అంతా ఆలోచిస్తున్న క్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ వ్యాఖ్యల ప్రభావం కూడా పడుతోంది అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో ఈ ప్రచారాలలో నిజాలు ఏమిటో.

# కోహ్లీలా నటించడం మానుకో.. గిల్‌పై ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ విమర్శలు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ మూడో రోజు గ్రౌండ్ లో చేసిన పనిపై ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ జోనాథన్ ట్రాట్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. అతను గిల్ దూకుడు శైలిని విరాట్ కోహ్లీ శైలితో పోల్చాడు. లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడో టెస్ట్ లో మూడో రోజు ఆట చివర్లో హై డ్రామా చోటు చేసుకుంది. శనివారం (జూలై 12) ఆట ముగియడానికి 10 నిమిషాలు మిగిలి ఉన్న దశలో జస్ప్రీత్ బుమ్రా తొలి ఓవర్ వేయడానికి వచ్చాడు. ఈ ఓవర్ మూడో బంతిని ఎదుర్కొనే ముందు జాక్ క్రాలీ పదే పదే బుమ్రా బౌలింగ్ ఆడకుండా పక్కకి వెళ్ళిపోయాడు. దీంతో టీమిండియా ప్లేయర్స్ అసహనానికి గురయ్యారు.

కెప్టెన్ శుభమాన్ గిల్ ఇంగ్లాండ్ కావాలనే సమయం వృధా చేస్తుందని భావించాడు. ఇంగ్లాండ్ ఓపెనర్ క్రాలీ దగ్గరకు వెళ్లి వేలు చూపిస్తూ మాట్లాడాడు. గిల్ చేసిన పని ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ జోనాథన్ ట్రాట్ కు నచ్చలేదు. టీమిండియాపై కెప్టెన్ పై విమర్శలు గుప్పించాడు. ట్రాట్ జియోహాట్‌స్టార్‌లో మాట్లాడుతూ.. "శుభ్‌మాన్ గిల్ నటన నాకు నచ్చలేదు. కెప్టెన్‌గా మీరు టోన్ పెద్దది చేసి మాట్లాడారు. మీరు ఒక కెప్టెన్ గా ప్రత్యర్థి ప్లేయర్ పై వేలు చూపించి మాట్లాడడం మునుపటి కెప్టెన్ ను గుర్తు చేస్తుంది. పోటీతత్వం టెస్ట్ క్రికెట్‌లో భాగమే అయినప్పటికీ, దానికి ఒక పరిమితి ఉంటుంది". అని ఈ ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ గిల్ పై తన అసహనాన్ని వ్యక్తం చేశాడు.

145/3 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఆట కొనసాగించిన ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 119.2 ఓవర్లలో 387 రన్స్‌కే ఆలౌటైంది. తర్వాత రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఇంగ్లండ్ ఆట ముగిసే టైమ్‌కు 1 ఓవర్ ఆడి 2/0 స్కోరు చేసింది. క్రాలీ (2 బ్యాటింగ్), డకెట్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. నాలుగో రోజు ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ రెండు వికెట్లు కోల్పోయింది. బెన్ డకెట్, పోప్ స్వల్ప స్కోర్లకే పెవిలియన్ కు చేరారు. ఈ రెండు వికెట్లను సిరాజ్ తీసుకున్నాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ 13 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 48 పరుగులుచేసింది. క్రీజ్ లో క్రాలీ (22), రూట్ (1) ఉన్నారు.

# కెప్టెన్ వికెట్ అంటే ఇది: నితీష్‌తో గిల్ సూపర్ ప్లాన్ అదుర్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో జరుగుతున్న మూడో టెస్టులో టీమిండియా పట్టు సంపాదించింది. నాలుగో రోజు ఆటలో భాగంగా చక చక మూడు వికెట్లు పడగొట్టి ఇంగ్లాండ్ ను కష్టాల్లోకి నెట్టింది. నాలుగో రోజు నితీష్ కుమార్ రెడ్డి తీసిన వికెట్ హైలెట్ గా మారుతుంది. గిల్ కెప్టెన్సీ, నితీష్ సూపర్ బాల్ కారణంగా ఈ వికెట్ వచ్చింది. ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ లో గిల్ ఆశ్చర్యకరంగా ఆకాష్ దీప్ కంటే నితీష్ ను ముందుగా బౌలింగ్ కు తీసుకొచ్చాడు. అంతేకాదు వికెట్ కీపర్ ను ముందుకు తీసుకొని వచ్చి నితీష్ చేత బౌలింగ్ చేయించాడు. గిల్ చేసిన ఈ ప్రయోగం ఫలించింది. 15 ఓవర్ ఐదో బంతికి నితీష్ రెడ్డి బాల్ ను ఆడబోయిన క్రాలీ (22) గాలిలో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఈ సిరీస్‌లో కొన్ని క్యాచ్‌లను వదిలివేసిన జైస్వాల్.. ఈ సారి ఎలాంటి తప్పు చేయకుండా అద్భుతమైన క్యాచ్ అందుకున్నాడు. క్రాలీని ఒత్తిడిలో పడేసిన గిల్.. చివరకు వికెట్ తీసి సక్సెస్ అయ్యాడు. దీంతో ఇంగ్లాండ్ 50 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయింది. వికెట్ నష్టపోకుండా 2 పరుగులతో నాలుగో రోజు ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ అంతకముందు బెన్ డకెట్, పోప్ వికెట్లను కోల్పోయింది. ఈ రెండు వికెట్లను సిరాజ్ తీసుకున్నాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ 19 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 61 పరుగులుచేసింది. క్రీజ్ లో బ్రూక్ (5), రూట్ (11) ఉన్నారు. భారత బౌలర్లలో సిరాజ్ రెండు నితీష్ కుమార్ తలో వికెట్ తీసుకున్నారు. తొలి ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ 387 పరుగులు చేయగా.. ఆతర్వాత ఇండియా కూడా సరిగ్గా 387 పరుగులు చేసింది.

# ఆటను ఆస్వాదించా.. పంత్‌లా షాట్లు కొట్టాలనుంది: కేఎల్ రాహుల్

**హైదరాబాద్ పెన్ పవర్:** లార్డ్స్ మైదానంలో సెంచరీ చేయడమనేది ప్రతి క్రికెటర్ కల. భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (%ఖూ ఞష్ట్రబశ్రీ%) ఈ స్టేడియంలో రెండు సెంచరీలు నమోదు చేయడం విశేషం. దిలీప్ వెంగ్‌సర్కార్ (3) తర్వాత ఎక్కువ సెంచరీలు చేసిన టీమ్‌ఇండియా బ్యాటర్‌గా కేఎల్ నిలిచాడు. చివరిగా 2021లో శతకం బాదాడు. ఇప్పుడు ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో కేఎల్ రాహుల్ (100) సెంచరీ చేసి జట్టును ఆదుకున్నాడు. ఈ సందర్భంగా 'ఆనర్స్' బోర్డులో తన పేరును మరోసారి లిఖించుకున్నాడు. అయితే, తాను రిషభ్ పంత్‌తో బ్యాటింగ్ చేయడాన్ని బాగా ఆస్వాదించినట్లు కేఎల్ వెల్లడించాడు. ఎలాగైనా అతడిలా షాట్లు కొట్టాలని ఉందని మనసులో మాట బయటపెట్టాడు. పంత్‌తో కలిసి నాలుగో వికెట్‌కు కేఎల్ 141 పరుగులు జోడించాడు. "మా ఇద్దరిలో కొన్ని సారూప్యతలు ఉన్నాయి. ఆట పట్ల ప్రేమ ఉంది. బ్యాటింగ్ చేయడం మా ఇద్దరికి చాలా ఇష్టం. క్లిష్ట సమయాల్లో నాణ్యమైన ప్రదర్శన చేయాలని భావిస్తాం. గత కొన్నేళ్లుగా పంత్‌తో కలిసి విలువైన భాగస్వామ్యాలను నమోదు చేశా. అతడితో బ్యాటింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తా. పంత్ ఆడుతున్నప్పుడు ఎలా బ్యాటింగ్ చేస్తున్నాడో నిశితంగా గమనిస్తూ ఉంటా. నేను కూడా అలా ఆడాలని కోరుకుంటా. మ్యాచులు లేనప్పుడు అలాంటి షాట్లను కొట్టాలని కలలు కంటా. క్రికెట్ గురించి మేమిద్దరం చాలా విషయాలు మాట్లాడుకుంటూనే ఉంటాం" అని కేఎల్ వెల్లడించాడు. టెస్టుల్లో రిషభ్ పంత్ తనదైన శైలిలో హిట్టింగ్ చేస్తాడు. అతడి డిఫెన్స్‌ను ఛేదించడం కూడా ప్రత్యర్థి బౌలర్లకు చాలా కష్టమే. ఎప్పుడు అగ్రెసివ్‌గా ఆడతాడో అంచనా వేయలేరు.

"పంత్ రనౌట్ కావడం బాధించింది. అంతకుముందే మేమిద్దరం మాట్లాడుకున్నాం. లంచ్ బ్రేక్ లోపే సెంచరీ పూర్తి చేస్తానని చెప్పా. బషీర్ బౌలింగ్‌లో షాట్ కొట్టా. అది ఫీల్డర్ దగ్గరకే వెళ్లింది. ఆ తర్వాత సింగిల్ తీసి ఇచ్చా. అయితే, స్ట్రైక్‌ను రొటేట్ చేసే ఉద్దేశంతో పంత్ పరుగు ప్రయత్నించాడు. అనూహ్యంగా రనౌట్ రూపంలో పెవిలియన్ చేరాడు. ఇది మా ఇద్దరికి తీవ్ర నిరుత్సాహం మిగిల్చింది. అయితే, ఎవరూ కావాలనే వికెట్‌ను సమర్పించాలని అనుకోరు" అని కేఎల్ అన్నాడు.




**క్రాలీ విషయంలో..**

"మైదానంలో జరిగిందంటే ఆటలో భాగమే. ఓపెనింగ్ బ్యాటర్ల కోణంలో నేను విషయాన్ని అర్థం చేసుకోగలను. నాకు తెలుసు.. అలాగే అక్కడ జరిగిందేంటో ప్రతి ఒక్కరికీ తెలుసు. క్రాలీ నాలుగో రోజు ఉదయం బాగానే ఆడతాడని అనుకుంటున్నా" అని కేఎల్ పేర్కొన్నాడు. మూడో రోజు ఆట చివర్లో క్రాలీ సమయం వృథా చేయడంపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే.

# సీనియర్ల దారిలోనే రష్మిక?

నటాసా స్టాంకోవిక్ క్యాజువల్ డెనిమ్ స్టైల్‌లో మెరిసింది






అనుక్రీతి వాస్ అద్భుతమైన రెడ్ బ్లేజర్ లుక్‌లో మెరుస్తోంది



కిరిక్ పార్టీతో కెరీర్ ను స్టార్ట్ చేసిన రష్మిక ఆ తర్వాత ఛలో సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చారు. మొదటి సినిమాతోనే హిట్ అందుకున్న రష్మిక గీతా గోవిందం సినిమా తర్వాత స్టార్ హీరోలందరితో సినిమాలు చేసి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా మారారు. కన్నడ నటిగా జర్నీని మొదలుపెట్టిన రష్మిక ఇప్పుడు నేషనల్ క్రష్ గా ఓ వెలుగు వెలుగుతున్నారు.కేవలం తెలుగులోనే కాకుండా తమిళ, హిందీ భాషల్లో కూడా సినిమాలు చేసి అన్ని భాషల్లోనూ తన సత్తా చాటుతున్న రష్మిక గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ క్రేజీ వార్త వినిపిస్తోంది. అల్లు అర్జున్- అట్లీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సినిమాలో రష్మిక నటిస్తున్నారని అంటున్నారు. అయితే ఇదేమీ క్రేజీ న్యూస్ కాదు, రష్మిక ఆ సినిమాలో నెగిటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్ లో కనిపించనున్నారని వార్తలొస్తున్నాయి.ఆల్రెడీ దాని కోసం లాస్ ఏంజెల్స్ లో లుక్ టెస్ట్ కూడా పూర్తవడంతో అల్లు అర్జున్ అట్లీ ప్రాజెక్టులో రష్మిక భాగం కావడం కన్ఫర్మ్ అని అందరూ భావిస్తున్నారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి ఛాలెంజెస్ ను స్వీకరిస్తూ వస్తున్న రష్మిక ఈసారి చాలా పెద్ద డెసిషనే తీసుకున్నారు. రష్మిక కెరీర్ మొదటి నుంచి కూడా కథ విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చారు.అయితే తన పాత్రకు ప్రాధాన్యం ఉండటంతో పాటూ, కమర్షియల్ సినిమాల్లో డ్యాన్సులు, స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆడియన్స్ ను ఆకట్టుకోవడం లాంటివి చేసిన రష్మిక పుష్ప, ఛావా, యానిమల్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద మంచి మార్కెట్ ను పెంచుకున్నారు. అయితే రష్మికను అందరి హీరోయిన్ల నుంచి భిన్నంగా ఉంచింది మాత్రం ఆమె స్క్రిప్ట్ సెలక్షనే. రష్మిక నచ్చనివాళ్లు ఆమెను ట్రోల్ చేసినా ఆమె మాత్రం ఎప్పటికప్పుడు తాను నటించిన సినిమాలతో ఆడియన్స్ కు హిట్స్ అందిస్తూనే ఉన్నారు.

ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రష్మిక హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలు కూడా చేస్తున్నారు. ఒకప్పుడు సౌందర్య, మీనా, రమ్యకృష్ణ లాంటి హీరోయిన్లు ఓ వైపు గ్లామర్ హీరోయిన్లుగా నటిస్తూనే మరోవైపు నెగిటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్లు చేసి ఆడియన్స్ ను ఆకట్టుకున్నట్టు ఇప్పుడు రష్మిక కూడా వారి దారిలోనే వెళ్తూ కొత్తగా ట్రై చేయాలని చూస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతానికైతే ఈ విషయంలో ఎలాంటి అధికారిక ప్రకటన వచ్చింది లేదు. కానీ ఒకవేళ రష్మిక అల్లు అర్జున్ అట్లీ మూవీ చేస్తే మాత్రం ఆ సినిమా తర్వాత రష్మిక కెరీర్ కు ఇక ఇప్పట్లో తిరుగనేదే ఉండదు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com